RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 70 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి బుధవారం 11-3-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥అష్టమి రా॥ 2.24, జ్యేష్ఠ రా ॥8.31, వర్జ్యం తె.॥.05.20ల, దుర్ముహూర్తం ఉ॥11.48-12.35, శుభ సమయం ఉ॥ 10.30-12.00, రాహుకాలం మ॥12.00-1.30, సూర్యోదయం ఉ॥ 6.17, సూర్యాస్తమయం సా॥ 6.04 గం॥

### విజయవాడ హైవేపై ప్రమాదంలో ప్రమాదం

ఆగివున్న వాహనాలను ఢీకొన్న లారీ

ఇద్దరు డ్రైవర్ల దుర్మరణం.. క్లీనరక్‌కు గాయాలు

2లో

# దేశీయంగా 10 శాతం ఎల్పిజి ఉత్పత్తి పెంపు

-గ్యాస్ కంపెనీలకు కేంద్రం ఆదేశం -పెట్రో కంపెనీలతో కమిటీ ఏర్పాటు

-కృత్రిమ కొరత సృష్టిస్తే అత్యవసర చట్టం ప్రయోగం -కేంద్ర మంత్రులతో ప్రధాని మోదీ అత్యవసర భేటీ

-పెట్రో, గ్యాస్ నిల్వలు, సరఫరాలపై సమీక్ష

**న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ):** దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ కొరత పెరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర పెట్రోలియం శాఖ రంగంలోకి దిగింది. గ్యాస్ ఉత్పత్తిని తక్షణమే పెంచాలని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఇంధన కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కనీసం 10 శాతం గ్యాస్ ఉ త్పత్తిని పెంచాలని కేంద్రం ఆదేశించింది. ముఖ్యంగా అంతర్జాతీయ పరిణామాల వల్ల సరఫరాలో ఏర్పడిన ఆటంకాలను అధిగమించి, దేశీయ అవసరాలకు తగినంత స్టాక్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం సూచించింది. సామాన్య ప్రజలకు వంట గ్యాస్ ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ఇరాన్ యుద్ధం భారత్‌లో చమురు ఆందోళనలు రేకెత్తిస్తోంది. దేశ ప్రజలకు ఇంధన, గ్యాస్ కొరత ఏర్పడకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురితో చర్చలు జరిపారు. ఎల్పీజీ ఉత్పత్తులు, సరఫరాపై సమీక్ష జరిపారు. ఇరాన్ యుద్ధం సామాన్యులపై ప్రభావం చూపకూడదని ప్రధాని మోదీ మంత్రులకు తెలిపారు. అలాగే యుద్ధంతో ఉత్పన్నమయ్యే అంతరాయాల గురించి చర్చించారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు పరిశ్రమల నుంచి గ్యాస్‌ను మళ్లించడం ద్వారా



ప్రజలకు గ్యాస్ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఇరవై ఒక్క రోజుల తర్వాత బుకింగ్‌లు జరిగేవి, ఇప్పుడు25 రోజులకు పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలానే ఎల్పీజీ ఉత్పత్తిని 10 శాతం పెరిగిందని కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధంతో హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కృత్రిమ కొరత కలగకుండా కేంద్రం ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ ప్రయోగించింది. బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను నియంత్రించే ఉద్దేశంతో పెట్రోలియం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో దాదాపు రెండున్నర లేదా మూడు రోజుల్లో వినియోగదారులకు గ్యాస్ సరఫరా జరిగేది, ప్రస్తుత పరిస్థితుల్లో కూడా అదే సమయం పడుతుందని వర్గాలు తెలిపాయి. అన్ని శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి, దేశవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 60 లక్షల సిలిండర్లు సరఫరా అవుతున్నాయని కేంద్ర వర్గాలు చెబుతున్నాయి. దేశంలో ఎల్పీజీ కొరత లేదని, సరఫరాను స్థిరీకరించామని కేంద్ర ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా దేశంలో పలు హోటళ్లు, రెస్టారంట్లు మూతపడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల నేపథ్యంలో కేంద్రం నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని 10 శాతం మేర పెంచాయని పేర్కొన్నాయి. కృత్రిమ కొరతను నిరోధించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ఎల్పీజీ సరఫరా విషయంలో సమస్యలను అర్థం చేసుకునేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలు వివిధ రెస్టారంట్ అసోసియేషన్లతో మాట్లాడుతాయి. ఇందుకోసం ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో ఓ కమిటీ ఇప్పటికే ఏర్పాటైంది. హోటళ్లు, రెస్టారంట్ల అవసరాలకు తగ్గట్టుగా కమిటీ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తుంది. అలాగే కొన్నిరోజుల వ్యవధిలోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి 10 శాతం మేర పెరిగింది. ఎల్పీజీ, ఎల్ఎన్జీ కన్‌సైన్‌మెంట్ వివిధ వనరుల నుంచి వస్తోంది. కొత్త కన్‌సైన్‌మెంట్ కూడా వచ్చే అవకాశం ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో మనం గతంలో సంక్షోభ పరిస్థితులు మిగతా 2లో..



# తెలుగు వైభవం ఉట్టిపడేలా అమరావతి

-క్రీడలు, పర్యాటకానికి పెద్దపీట వేసేలా ప్రణాళికలు

-వివిధ సంస్థలకు భూ కేటాయింపులు

-సీఆర్‌డీఏ అథారిటీ 59వ సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి,మార్చి10(ఆర్ఎన్ఎ):** తెలుగు వైభవం చాటేలా అమరావతి అభివృద్ధి జరగాలని సీఎం చంద్రబాబు అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు. క్రీడలు, పర్యాటకానికి పెద్దపీట వేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సీఆర్‌డీఏ అథారిటీ 59వ సమావేశం జరిగింది. భూ కేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలన్నారు. మరోవైపు సీబీఎస్ఈ కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయింపునకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయతీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్‌డీకి 5 ఎకరాల భూ కేటాయింపునకు అనుమతిచ్చింది. సచివాలయం, హెచ్‌వోడీ టవర్ల పనులకు రూ.2,316 కోట్లకు పాలనా మిగతా 2లో..

# ఇరిగేషన్ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

-ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తి

-ప్రణాళికా బద్ధంగా పనులు సాగుతున్నాయి

-పోలవరం పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

**పోలవరం,మార్చి10(ఆర్ఎన్ఎ):** పోలవరం సహా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను క్రమపద్ధతిలో పూర్తి చేసేలా ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు పనులను మంత్రి రామానాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇరిగేషన్ రంగానికి గతంలోనూ, ప్రస్తుతం కూడా కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసి ప్రాజెక్టులు పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వంలో కీలకమైన డయాఫ్రం వాల్ ధ్వంసం కావడంతో, నాణ్యత, ప్రజా భద్రత దఅష్ట్యా కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) డిజైన్స్ ప్రకారం పోలవరం పనులు జరుగుతున్నాయని, అంతర్జాతీయ నిపుణుల ప్యానల్ సూచనలు



పాటిస్తూ నిర్మాణం కొనసాగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ప్రతిరోజూ డిజైన్ల ప్రకారం జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తోందని, పనుల పురోగతిని కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని చెప్పారు. కొత్త డయాఫ్రం వాల్ మొత్తం 1372 మీటర్లకు గానూ ఇప్పటికే 1300 మీటర్లు పూర్తయ్యాయని, ఈ నెలాఖరుకల్లా పూర్తి అవుతుందని పేర్కొన్నారు. అదే విధంగా ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో నేలను గట్టిపరచే వైబ్రో కాంప్యాక్షన్ మిగతా 2లో..

# పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

-విస్తారమైన సముద్రతీరం, సహజ వనరులు ఉన్నాయి

-పెట్టుబడులు పెట్టడానికి రండి

-ముంబైలో జరిగిన ఎక్స్‌పోలో మంత్రి కందుల దుర్గేశ్ పిలుపు

**ముంబై,మార్చి10(ఆర్ఎన్ఎ):** ఏపీ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని, 2024-29 నూతన పర్యాటక పాలసీ ద్వారా ఇన్వెస్టర్లకు రాయితీలు కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కులు, వాటర్ ఫ్రంట్ అట్రాక్షన్స్, అడ్వెంచర్ జోన్‌ల ఏర్పాటుకు రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సుదీర్ఘ తీరప్రాంతం, గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ముంబైలో 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్ మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్(ఐఏఏపీఐ) ఎక్స్ పోలో పర్యటకశాక మంత్రి కందుల దుర్గేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏపీలో అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్కులు, వాటర్ పార్కులు, అడ్వెంచర్ జోన్‌ల ఏర్పాటుకు ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. ఏపీలో వినోద రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనువైన వాతావరణం ఉందన్నారు. విమానాశ్రయాల విస్తరణ, మెరుగైన రవాణా సౌకర్యాలు, పెరుగుతున్న పట్టణీకరణ వంటివి



రాష్ట్రాన్ని పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా మార్చాయని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దార్శనికతతో 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'ను రూపొందించామని మంత్రి దుర్గేశ్ చెప్పారు. హోటళ్లు, థీమ్ పార్కులు, రిసార్టుల కోసం భూమి కేటాయింపు ప్రక్రియను సరళతరం చేస్తూ.. దేశంలోనే మొదటిసారిగా ఈ విధానాన్ని తీసుకొచ్చామని ఆయన ప్రకటించారు. రూ.50 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టే వారికి ఎస్ఐపీబీ ద్వారా భూమి కేటాయింపులు జరుగుతాయని మంత్రి దుర్గేశ్ తెలిపారు. గత ఏడాది 102 ఒప్పందాల ద్వారా మిగతా 2లో..



# పెరుగుతున్న ఎండల తీవ్రత

ముందస్తు చర్యలపై ప్రభుత్వం అప్రమత్తం

అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత

అమరావతి,మార్చి10(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ముందస్తు చర్యలపై సమీక్షించింది. ఎండల తీవ్రత, వడగాల్పుల పరిస్థితులపై హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026'ను హోంమంత్రి ఆవిష్కరించారు. అధికారులందరూ ఈ ప్లాన్‌ను అనుసరించి ముందుకు సాగాలని ఆదేశించారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మిగతా 2లో..




# బెంగాల్‌లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

-ఇసి ఆదేశాల మేరకే ఉద్యోగులు పనిచేయాలి

-అర్హులైన ఏ ఒక్కరి పేరూ తొలగించలేదు

-ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్

**కోల్‌కతా,మార్చి10(ఆర్ఎన్ఎ):** ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఏ ఒక్క ఓటరును తొలగించేది లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలు జరపడానికే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈసీ ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని, ఎలాంటి లోటుపాట్లను సహించేది లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో వరుస సమావేశాల అనంతరం మీడియాతో సీఈసీ మంగళవారం నాడు మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో 80,000 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వీటిలో 61,000 బూత్‌లు మిగతా 2లో..

# న్యాయవ్యవస్థ అవినీతి పాఠ్యాంశం తొలగించాం!

-పుస్తకాన్ని అందుబాటులో లేకుండా చేశాం

-సుప్రీం కోర్టుకు ఎన్‌సిఇఆర్‌టి బహిరంగ క్షమాపణలు

**న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ):** 8వ తరగతి సోషల్ పాఠ్యపుస్తకంలో వివాదాస్పద అధ్యాయంపై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం సుప్రీంకోర్టుకి




బహిరంగ క్షమాపణలు తెలిపింది. న్యాయవ్యవస్థలో 'అవినీతి'గురించి పాఠ్యపుస్తకంలో ప్రస్తావించడంపై సుప్రీంకోర్టు రెండు వారాల క్రితం ఎన్‌సిఇఆర్‌టిని మందలించిన సంగతి తెలిసిందే. ఈ అధ్యాయంపై సుమోటోగా కేసు నమోదు చేసిన సుప్రీంకోర్టు.. పాఠ్యపుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. దీంతో ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ , సభ్యులు పుస్తకంలో ప్రకటించిన అధ్యాయానికి బేషరతుగా, తగిన అర్హతతో కూడిన క్షమాపణలు చెబుతున్నాం. మొత్తం పుస్తకం ఉపసంహ రించబడింది. అందుబాటులో లేదని పేర్కొంది. ఈ కారణంగా కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. సభ్యుల అవగాహనకు అభినందిస్తున్నాం అని పేర్కొంది. విద్యా సమాచారంలో ఖచ్చితత్వం, సున్నితత్వం మరియు బాధ్యతతో కూడిన అత్యున్నత ప్రమాణాలను నిర్వహించడానికి ఎన్‌సిఇఆర్‌టి కట్టుబడి ఉందని పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఆ పుస్తకంపై మిగతా 2లో..

# దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలకు పెద్దపీట

-ఏకంగా రూ. 8.8 లక్షల కోట్లతో ఆరు భారీ ప్రాజెక్టులు

-జల్ జీవన్ మిషన్ పొడింపునకు మరో రూ.8.7 లక్షల కోట్ల

-అంతర్జాతీయ విమానాశ్రయంగా మధురై ఎయిర్‌పోర్టు

- కేంద్ర కేబినేట్ వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ):** ప్రధాని మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ ఏకంగా రూ. 8.8 లక్షల కోట్ల విలువైన ఆరు భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇక జల్ జీవన్ మిషన్ పొడింపు కోసం మరో రూ.8.7 లక్షల కోట్లను కేటాయించింది. ముధురై ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించేందుకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక సంత్రాగచ్చి-ఖరగ్‌పూర్ మధ్య రూ.2,905 కోట్లతో 4 లైన్ల రహదారి, రూ.3,839 కోట్లతో బద్నావర్-థాండియా-తిమర్వానీ మధ్య మిగతా 2లో..



భగవద్భక్తి, గురుభక్తి, సత్యమునందు విశ్వాసం ఉన్నంత వరకు ఏదీ నీకు హాని కలిగించలేదు. ఈ ప్రపంచంలో మన చేతలే మన భావి జీవితాన్ని నిర్ధారిస్తాయి.

## శ్రీసిటీని సందర్శించిన ‘సోలుం’ చైర్మన్

### -పెట్టుబడి అనుకూల వాతావరణంపై ప్రశంస



**శ్రీసిటీ/వరదయ్యపాలెం,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీసిటీలో నిర్మాణ తుదిదశలో ఉన్న సోలుం ఇండియా హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పురోగతి సమీక్షలో భాగంగా సోలుం కంపెనీ లిమిటెడ్ చైర్మన్ ఌ సీఈఓ సుంఘో జున్ మంగళవారం తొలిసారిగా శ్రీసిటీ సందర్శించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సుంఘో జున్‌కు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. శ్రీసిటీ, సోలుం సంస్థ భాగస్వామ్యం భారతదేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందడానికి ఊతం ఇస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీసిటీ పెట్టుబడిదారుల అనుకూల విధానాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, సమర్థ నిర్వహణను సుంఘో జున్ ప్రశంసించారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వ సహకారం, శ్రీసిటీ అందిస్తున్న సౌకర్యాలను ఆయన అభినందించారు. శ్రీసిటీలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.268 కోట్ల పెట్టుబడితో సోలుం ఇండియా హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ దేశంలో తన రెండవ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడటంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధికి దోహదం కానుంది. ఈ ప్లాంట్‌లో 3-ఇన్-1 టీవీ బోర్డులు, సర్వర్ పవర్ సప్లైలు, ఈవీ ఛార్జర్ భాగాలు, కంట్రోల్ యూనిట్లు, ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్ (ఐూరాం) వంటి ఆధునిక ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు తయారు చేయనున్నారు. దీంతో పవర్ మాడ్యూల్స్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ తయారీలో సోలుం సంస్థ గ్లోబల్ మార్కెట్‌లో మరింత బలపడనుంది.

## కైలాస ధామంకు రూ.లక్ష విరాళం

**చంద్రగిరి,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో నిర్మిస్తున్న కైలాస ధామంకు దాతలు ముందుకువస్తున్నారు. కైలాస ధామం నిర్మాణంలో నేను సైతం అంటూ ముందుకు వచ్చిన లల్లీనాథ్ రెడ్డి కైలాస ధామంకు రూ.లక్ష విరాళం అందజేశారు. విరాళం ప్రకటించిన లల్లీనాధ్ రెడ్డికి కైలాస ధామం కమిటీ సభ్యులుప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమేష్ రెడ్డి, నాగరాజు నాయుడు, ఓంకార్ భరత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులు



**పీలేరు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాత సావిత్రిబాయి పూలే 129 వ వర్ధంతిని పురస్కరించుకొని నేడు పీలేరు సమీపంలోని ఇందిరమ్మ కాలనీ నందు ఏపీ గిరిజన యానాది సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. నాయకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని నాయకులు మాట్లాడుతూ బాల్యవివాహాలు, సతీసహగమనం, అంటరానితనం వంటి దురాచారాల నిర్మూలనకు విరోచిత పోరాటం చేశారని, వితంతువులకు పునర్వివాహాలు జరిపించాలని తన భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికల కోసం తొలి పాఠశాలను ఏర్పాటుచేసి ఆ పాఠశాలకు భారతదేశంలోనే మొట్టమొదటి తొలి ఉపాధ్యాయురాలుగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో డివిఎంసి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, మాదిగ దళ పోరాట సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంచార్జ్ వేలూరు పురుషోత్తం, సద్దల రామచంద్ర, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు యర్రబల్లి మల్లికార్జున, శివకుమార్, రామకృష్ణ, జ్యోతమ్మ, ప్రేమావతి, మల్లీశ్వరి, ముని కుమారి తదితరులు పాల్గొన్నారు.

## వారపు సంతలో పరిశుభ్రతను పాటించాలి



**పీలేరు,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో ప్రతి మంగళవారం జరిగే వారాంత సంతకు వేలాది మంది రైతులు, వ్యాపారులు, వినియోగదారులు హాజరవుతుంటారు. అయితే ప్రస్తుతం సంతలో పరిశుభ్రత పరిస్థితి ఆందోళన కలిగించే విధంగా మారింది. సంత ప్రాంగణం మొత్తం చెత్త, పండ్ల అవశేషాలు, కూరగాయల వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. సంతలో సరైన పరిశుభ్రత లేకపోవడం వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు ఈగలు, దోమలు అధికంగా కనిపిస్తున్నాయి. దీనివల్ల అక్కడకు వచ్చే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగడానికి నీళ్లు కూడా అందించడం లేదని, గేట్ వసూళ్లు మాత్రం ముక్కు పిండి వాసులు చేస్తున్నారని వాపోయారు. ప్రతి వారం వేలాది మంది ప్రజలు, రైతులు సంతకు వచ్చే నేపథ్యంలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు తాగడాని నీరుకూడ ఏర్పాటు చాలా అవసరం. అదేవిధంగా సంత ప్రాంగణంలో తగిన సంఖ్యలో చెత్త బుట్టలు లేకపోవడం, చెత్తను సమయానికి తొలగించకపోవడం వంటి సమస్యలు పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తున్నాయి. రైతులు మరియు వ్యాపారులు కూడా సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై స్పందించిన అన్నమయ్య జిల్లా డివియంసి సభ్యులు బొడీషా వలి మాట్లాడుతూ, పీలేరు మంగళవారం సంతలో పరిశుభ్రతను మెరుగుపరచడానికి పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సంత ముగిసిన వెంటనే చెత్తను తొలగించడం, తగిన సంఖ్యలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయడం, శుభ్రత సిబ్బందిని నియమించడం వంటి చర్యలు తీసుకుంటే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన సూచించారు. పీలేరు పట్టణానికి వచ్చే ప్రజలు, రైతుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మంగళవారం సంతను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని మరియు తాగడాని నీటి సౌకర్యం ఉంచాలని బోదెషా వాలి కోరుతున్నారు.

## మైనార్టీల సంక్షేమంపై దగ్గుపాటివి గాలి మాటలు: మేయర్



**అనంతపురం,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మైనార్టీల సంక్షేమంపై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటివి గాలి మాటలు తప్పా ఆచరణలో చేసింది ఏమి లేదని మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ వైసీపీ హయాంలో మైనార్టీలకు ఏమి చేయలేదని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.పదే పదే అసత్య ప్రచారాలు, గాలి మాటలు మాట్లాడటం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కు అలవాటుగా మారిందని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకువచ్చిన 4 శాతం రిజర్వేషన్ల వల్ల నేడు ముస్లిం యువతీ యువకులు విద్య వైద్య రంగాలలో రాణిస్తున్నారన్నారు. అదే విధంగా వైసీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మైనార్టీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపును కల్పించారని కొనియాడారు. ఇమాంలకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేలు గౌరవ వేతనం అందజేత, హజ్ యాత్రకు రూ.లక్ష అర్థక సాయం, హజ్ ఆస్తులు పరిరక్షణ, రూ.23 వేల కోట్లు వెల్ఫేర్ స్కీమ్‌ల ద్వారా మైనార్టీల కుటుంబాలకు ఆర్థిక సాయం అందుచేత, పేద ముస్లిం యువతుల వివాహాలకు రూ.లక్ష షాధి తోఫా అందజేత వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. వీటన్నింటినీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, ఇషాక్, మైనార్టీ నాయకులు ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెంట్ ధరించకపోతే జరిమానాలు: ఎస్సై

**రామచంద్రపురం, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే తనిఖీలలో పట్టుబడితే జరిమానాలు తప్పవని ఎస్సై భక్తవత్సలం అన్నారు. మంగళవారం మండలంలోని రాయల చెరువు కట్ట కింద ఉన్న జలకన్టేశ్వర స్వామి ఆలయం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలికాపాడుకోవచ్చు అన్నారు. ఈ తనిఖీలలో వాహనాలకు సరైన రికార్డు లేకపోయినా, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. వాహన చోటుకులు మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాన్ని సీట్ చేస్తామని హెచ్చరించారు. వాహనాలను అతి వేగంగా నడిపితే ప్రమాదాలు సంభవిస్తాయని పరిమిత వేగములోని వాహనాలు నడపాలని సూచించారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు, బాబు, సుధాకర్, శివ, ధరణి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

**రామచంద్రాపురం,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై భక్తవత్సలం హెచ్చరించారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్ ఎద్దుల బాబు రెడ్డి, 6 మంది ఆకతాయిలకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీరమా కుల కండ్రిగ గ్రామానికి చెందిన సస్పెక్టెడ్ రౌడీషీటర్ వై బాబు రెడ్డి గ్రామాలలోని ఆకతాయిలకు మద్యం తాపించి యువకుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఏడు మందిపై బైండోవర్ కేసు నమోదు చేసి డిప్యూటీ తహసీల్దార్ ఎం అన్వర్ భాష ముందు హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమంలో రౌడీ షీటర్ వై బాబు రెడ్డి కవిలి వెంకయ్య, బీగాల మోహన్ ఏ పాండు. ఎం మహేష్, టి సునీల్, టీ గౌతమ్ ఏ గని, వై అజిత్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, ఓబుల్ రెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 13న విశ్వకర్మ ప్రదర్శన మేళా

**రామచంద్రాపురం,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి శిల్పారామం, మదనపల్లి సిటిఎం రోడ్ శివాజీ నగర్ లోని పద్మావతి కల్యాణ మండపంలో ఎంఎస్ ఎంఈ డెవలప్మెంట్, ఫెసిలిటేషన్ విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో (మార్చి 13 నుండి 15 వరకు) మూడు రోజులపాటు ప్రధానమంత్రి విశ్వకర్మ ప్రదర్శన మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ మురళీమోహన్(చినబాబు) తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ అసంఘటిత రంగ చేతి వృత్తి కళాకారులకు ఆర్థిక స్వాలంబన కల్పించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో తిరుపతితో పాటు అన్నమయ్య జిల్లా పరిశ్రమల కేంద్రం డిఆర్డిఏ మెప్మా సహకారంతో కుటుంబ ఆధారిత చేతివృత్తుల వారికి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడాకి ఎంతగానో ఉపయోగపడు తుందని అన్నారు. 18 రకాల చేతి వృత్తుల వారు ఈ మేళాను సందర్శించడానికి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చేతి వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## చింత చెట్లు నరికివేత



**పలమనేరు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చెన్నై-బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న చింతమాండ్లను కొంతమంది అక్రమార్కులు రాత్రికి రాత్రే కోసి వేయడం పరిపాటిగా మారింది. మొదుల్ల పైన మట్టిని పోసినారు. ఎవరు కూడా గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉంటుంది. పలమనేరు పెద్ద చెరువు కట్టపై ఉన్న ఎన్నో ఏళ్ల నాటి చింత చెట్లను కోసి వేసినారు. ఈ విషయాన్ని ఆర్ అండ్ బి ఏ ఈ ఆది కేశవులను వివరణ కోరగా.. ఆ చింతమాండ్లను ఎవరు కోశారో తన దృష్టికి రాలేదని తెలిపారు. తాను ఎవరికి పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు. చింతమాండ్లను ఎవరు కోశారో తెలియదన్నారు. తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

## స్టార్టప్‌లకు, ఆధునిక సాంకేతిక అభివృద్ధికి ఆర్ఆర్‌క్యాట్ మద్దతు

**ఇండోర్, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అణుశక్తి విభాగం పరిధిలో పనిచేస్తున్న దేశంలోని ఆరు ప్రముఖ పరిశోధనా కేంద్రాలలో ఒకటైన రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ టెక్నాలజీ, ఇండోర్, స్టార్టప్‌లకు సాంకేతిక మార్గదర్శకత్వం, పరిశోధనా సహాయాన్ని అందిస్తూ ముందుకు సాగుతోంది. పార్టికల్ యాక్సిలరేటర్లు, లేజర్లు, సంబంధిత సాంకేతికతల రూపకల్పన, పరిశోధనల్లో నైపుణ్యం కలిగిన ఆర్ఆర్ క్యాట్, సామాజిక, పారిశ్రామిక ప్రయోజనాలున్న అనువర్తనాలను అభివృద్ధి చేయడంలో యువ ఆవిష్కర్తలకు సహకరిస్తోంది. 1984లో స్థాపించబడిన ఈ కేంద్రం తరువాత రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ టెక్నాలజీగా పేరు మార్చబడింది. యాక్సిలరేటర్లు, లేజర్ సాంకేతికతలలో కేంద్రం విశేష నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంది. ఈ సాంకేతికతలు కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వైద్య రంగాలలో ఉపయోగపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మీడియా ప్రతినిధులతో జరిగిన పరస్పర చర్చలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ అండ్ సపోర్ట్ గ్రూప్ డైరెక్టర్ డా.జిష్ణు ద్వివేది మాట్లాడుతూ విశాఖపట్నంలో ప్రోటాన్ యాక్సిలరేటర్ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా ఆర్ఆర్ క్యాట్ పనిచేస్తోందని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతికతలు ప్రస్తుతం పరీక్ష దశలో ఉన్నాయని, ఈ సదుపాయం పూర్తిగా స్థాపించేందుకు రెండు దశాబ్దాలు పట్టవచ్చని చెప్పారు. భారత్‌లో సమృద్ధిగా లభించే థోరియం నుండి యురేనియం ఉత్పత్తికి ఈ వ్యవస్థ సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఆర్ఆర్‌క్యాట్‌లో జాతీయ స్థాయి ప్రయోగశాలలు ఉన్నాయని, వాటిలో పరిశ్రమలు, వైద్య సంస్థలు, విద్యాసంస్థలు వినియోగదారుల ప్రయోగాలు నిర్వహిస్తున్నాయని డా.ద్వివేది తెలిపారు. లీనియర్ యాక్సిలరేటర్ల ఆధారంగా అభివృద్ధి చేసిన ఎలక్ట్రాన్ బీమ్ రేడియేషన్ సదుపాయం ద్వారా వైద్య పరికరాల శుద్ధీకరణ జరుగుతుండగా, ఈ సాంకేతికతను 35కు పైగా దేశాలకు వాణిజ్యపరంగా ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. “శాస్త్రీయ జ్ఞానం సామాజిక ప్రయోజనాలకు చేరేలా పరిశోధన కార్యక్రమాలను ఆర్ఆర్‌క్యాట్ కొనసాగిస్తోంది,” అని ఆయన చెప్పారు. ఆర్ఆర్‌క్యాట్‌లోని ఏబిసీ పీఐఈ-హబ్ డైరెక్టర్ డా.క్రైస్ట్ ప్రకాష్ పాల్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో పరిశ్రమలు మరియు స్టార్టప్‌లతో 32 ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ప్రస్తుతం 9 స్టార్టప్‌లు కేంద్రంతో కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. వాటిలో ఒక స్టార్టప్ పారిశ్రామిక వినియోగదారుల కోసం మెటల్ 3డి ప్రింటింగ్ సాంకేతికతపై పని చేస్తుండగా, మిషన్ క్రిటికల్ ఫోటోనిక్స్ అనే స్టార్టప్ రైల్వేలు, విమానాలు, వంతెనలలో ఉపయోగించే ఫైబర్ ఆధారిత ఆప్టికల్ సెన్సర్లను అభివృద్ధి చేస్తోంది. మరో స్టార్టప్ ఎంఆర్ఐ యంత్రాల్లో ఉపయోగించే 30 కెల్విన్ క్రయోకూలర్ల అభివృద్ధికి ఆర్ఆర్‌క్యాట్ మద్దతు అందిస్తోంది. తక్కువ ఖర్చుతో కూడిన మెటల్ 3డి ప్రింటర్లపై ఆర్ఆర్‌క్యాట్ పేటెంట్లు కలిగి ఉందని, అలాగే కేంద్రం అభివృద్ధి చేసిన లేజర్ సాంకేతికతలు పరిశ్రమలకు పాడైపోయే యంత్రాలను పునరుద్ధరించడంలో సహాయపడుతున్నాయని డా.పాల్ తెలిపారు.

# తిరుపతి జిల్లా

## చిరుత సంచారం అవాస్తవం: అధికారులు

**బైరెడ్డిపల్లి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బైరెడ్డిపల్లి మండలంలో చిరుత సంచారం అంటూ సోషియల్ మీడియాలో సోమవారం ఓ కథనం చక్కర్లు కొట్టింది. దీనిపై ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుత సంచారం అవా స్థవమని తేల్చారు. నెల్లిపట్ల గ్రామానికి చెందిన గౌస్ బాషాకు చెందిన లేగ దూడను రెండు నెలలు మునుపు చిరుత చంపేసిందని రైతన్న సోమవారం మొర పెట్టుకొన్నాడు. ఆ రోజు జరిగిన ఘటన నేడు వెలుగులోకి రావడం ఏమిటి? ఒక వేళా జరిగింటే పారెస్టు అధికారులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు? సమాచారం ఇచ్చింటే నష్ట పరిహారం అందేది కదా? ఈ వేసులు బాటు మనకు తక్షణశీ అమలులోకి తీసుకోరావడంలో పలమనేరు పారెస్టు అధికారులు ముందంజలో ఉన్నారు కదా? ఒక వేళ చిరుత కరిచింటె దూడ మెడ భాగం దెబ్బతినాలి,కానీ వేరే భాగాల్లో గాయం తగిలింది.ఈ ఘటన కుక్కల్లో లేక హైనాలు ఉండొచ్చు కదా! అని పారెస్టు అధికారులు బాధితులన్ని ప్రశ్నిస్తుంటే సమాధానాలు కరువు అవుతున్నాయి. ఈ ఘటనపై ఎఫ్ఆర్ఓ నారాయణను వివరణ కోరగా రెండు నెలలు మునుపు అంటున్నారు బాధితులు. దేనికి గురైందని రెండు నెలలు తరువాత అంచనా వెయ్యాలి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు సమాచారం ఇవ్వడం మీకు పూర్తి స్థాయిలో సహకరిస్తాం.. తప్పుడు సంకేతాలు ఇవ్వొద్దని రైతన్నలను కోరారు.

## దేశంలో క్రైస్తవులకు భద్రత కల్పించాలి

**కడప,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశంలో క్రైస్తవులకు భద్రత కల్పించాలని కోరుతూ కడపలో మంగళవారం దైవ సేవకుల ఐక్య సదస్సు నిర్వహించారు. ఇందులో వందలాదిగా పాస్టర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా డాక్టర్ కోలా ప్రసాద్, దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ మాట్లాడారు.ప్రస్తుతం క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, మందిరాల విషయమై పాలక ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. క్రైస్తవులకు భద్రత విషయమై ప్రత్యేకమై చట్టం సభల్లో ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. క్రైస్తవ మంటే కులం, మతం కాదని అదొక రక్షణ మార్గమని చెప్పారు. క్రైస్తవ పట్ల ఎవరికి ఎటువంటి హాని లేదని క్రైస్తవం ఎప్పుడు కులాలను మతాలను మార్చదనే విషయాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు. క్రైస్తవులపై రోజురోజుకు పెరుగుతున్న దాడుల పట్ల వెంటనే ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకొని వాటిని నిర్మూలించాలని పేర్కొ న్నారు. ఇందులోమల్లెం విజయ్ భాస్కర్, షద్రక్ పాస్టర్ ప్రశాంత్, దేవరాజు, డేవిడ్ రాజ్, కృపా రాజు, ఆనంద్ పాల్ రెడ్డి, ఎం ఫిలిప్, వై మార్కు తదితరులు పాల్గొన్నారు.

## మత సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలి: జేసీ

**కడప,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భిన్నత్వంలో ఏకత్వం భారతదేశము ప్రత్యేకత అని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగల నిర్వహణపై జేసీ డా నిధి మీనా అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్‌లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. దీనికి రాజంపేట సబ్ కలెక్టర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఓలు చంద్రమోహన్, చిన్నయ్య, కడప మున్సిపల్ కమిషనర్ రాకేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మత సంప్రదాయాలను గౌరవి స్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావర ణంలో భక్తి భావంతో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలను నిర్వహించుకునేలా జిల్లా శాంతి కమిటీ సభ్యులు సమన్వ య సహకారాలు అందించాలని తెలిపారు. రంజాన్, ఉగాది, శ్రీరామ నవమి పండుగ వేడుకలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపు కునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఉగాది పండుగతో పాటు రంజాన్ శ్రీరామనవమి పండుగలు వరుస క్రమంలో ఉన్నందున ప్రజలందరూ మత సామరస్యాన్ని పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలని అన్నారు. సమావేశంలో మైనారిటీ శాఖ జిల్లా అధికారి హిదియతుల్లా, శాంతి కమిటీ సభ్యులు, పోలీసు శాఖ, వివిధ శాఖల అధికారులు, దేవాదా యశాఖ, మైనారిటీ అధికారులు, పలువురు అలయ అర్చకులు, మౌజమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత భవిష్యత్తు కోసం బాటలు వేసుకోవాలి

### - జయప్రకాష్ నారాయణ




**కడప, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముందు చూపు ఉండాలంటే కొత్త విషయాలు నేర్చుకుని అవసరాలకు అన్వయించుకునే నేర్పరితనం అలవాటుగా చేసుకోవాలని, మారిన పరిస్థితులకు నేర్చుకున్నది అన్వయించుకోవాలని ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర విశ్రాంత ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ఎన్.జయప్రకాష్ నారాయణ్ అన్నారు. యోగివేమన విశ్వవి ద్యాలయం 21వ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల 21వ వార్షి కోత్సవం విశ్వవిద్యాలయ ప్రాం గణంలోని ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ గ్రంథాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ భవిష్యత్తులో మీరు చేయబోయే ఉద్యోగాలలో నూటికి 70 ఉద్యోగాలు ఇంకా సృష్టించడం జరగలేదన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా మారుతోందనే విషయం గుర్తించి అందుకు అనుగుణంగా సంసిద్ధులు కావాలన్నారు. మనకు తెలియని కొత్త కొత్త వృత్తులు మన ముందుకు రాబోతున్నాయని అది రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేదే కాకుండా మరేదైనా ఉండవచ్చు న్నారు. విశ్వవిద్యాలయం ఉపకుల పతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖ ర్ మాట్లా డుతూ డా.జయప్రకాష్ నారాయణ్ నడుస్తున్న గ్రంథాలయమని, ఎంతోమందికి ఆయన స్ఫూర్తిప్రదాత అన్నారు. క్యాంపస్ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ టి.శ్రీనివాన్ కళాశాల ప్రగతి నినివేదించారు. ప్రొద్దుటూరు వైవీయూ వైఎస్సార్ ఇంజినీరింగు కళాశాల ప్రధానాచా ర్యులు ప్రొఫెసర్ జి.జయచంద్రారెడ్డి కళాశాల ప్రగతిని వివరించారు. రిజిస్టర్ ప్రొఫెసర్ పద్మ విశ్వ విద్యాలయం పోటీపడి ముందుకు వెళుతోందని ఆ ఫలితాలను వివరించారు కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లి కార్జునరెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్ పాల్గొనగా ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి సభా సమన్వయం చేశారు. డా.సునీత ముఖ్య అతిథిని సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో విద్యా ర్థులు, అధ్యా పకులు, స్కాలర్లు పాల్గొన్నారు. ఫౌండేషన్ డే కళాశాల ఉత్సవం సందర్భంగా బోధన, బోధనేతల సిబ్బందికి నిర్వహిం చిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు.

## టాటా ఏసీ వ్యాన్ బోల్తా: తప్పిన ప్రమాదం



**తొట్టంబేడు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తొట్టంబేడు మండలం ఎన్‌హెచ్--7 జాతీయ రహదారిపై మల్లిగుంట రోడ్డు సమీపంలో మంగళవారం టమోటా లోడ్‌తో అతివేగంగా వెళుతున్న టాటా ఏసీ వ్యాన్ టైరు పగలడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. వాహనంలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు.అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ముగ్గురూ సురక్షితంగా బయటపడ్డారు. ఘటనతో కొంతసేపు రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు వెంటనే స్పందించి వాహనాన్ని రహదారి పక్కకు జరిపి ట్రాఫిక్‌ను సవ్యంగా సాగేటట్లు చేశారు.

## పిఐబి వార్షిక టూర్‌లో మీడియా ప్రతినిధులు



**విజయవాడ, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పిఐబి వారి వార్షిక టూర్‌లో భాగంగా కొంతమంది మీడియా ప్రతినిధులను మధ్యప్రదేశ్ తీసుకు వెళ్ళటం జరిగింది. ఈ బృందంలో ఈనాడు, సాక్షి ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, ది హిందూ, ఇంగ్లీష్ దినపత్రిక, హాన్స్ ఇండియా ఇంగ్లీష్ దినపత్రిక, స్కై లైన్ ఇంగ్లీషు దినపత్రిక, చిన్న పత్రిక రాయలసీమ సమయం ప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి దూరదర్శన్ వారు, మున్సఫ్ టీవీ వారి తరపున ప్రతినిధులు పాల్గొన్నారు. స్కైలైన్ దినపత్రిక తరపున విజయవాడ బ్యూరో నుంచి స్టాఫ్ రిపోర్టర్ పాల్గొన్నారు.

# అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే చిత్తూరు అభివృద్ధి

## - ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ - 2026-27 బడ్జెట్ అంచనాలకు ఆమోదం



**చిత్తూరు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అందరూ కలిసి పని చేస్తేనే చిత్తూరు అభివృద్ధి సాధ్యమవుతుందని, అభివృద్ధి కోసం కలిసి వచ్చే ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకెళ్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం చిత్తూరు నగరపాలక చివరి కౌన్సిల్ సాధారణ సమావేశం నగర మేయరు ఎస్ అముద అధ్యక్షతన జరిగింది. సమావేశంలో భాగంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడారు. చిత్తూరు అభివృద్ధి కోసం తనతో కలిసి వచ్చిన మేయర్, డిప్యూటీ మేయర్లు, సభ్యులకు అభినందించారు. ఏ పార్టీలో ఉన్నా.. ప్రజల కష్టాలకు స్పందించి పనిచేయాలన్నారు. చిత్తూరు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి పనులు చేయడానికి ముందుకు వచ్చారని అభినందించారు. గడిచిన నాలుగు దశాబ్దాల్లో చిత్తూరు అభివృద్ధి అనుకున్న స్థాయిలో జరగలేదని.. ఈ పరిస్థితిని మార్పు చేసి చిత్తూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు వివరించారు. చిత్తూరు ఫారెస్ట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలుడు నిరూప్ పేరు మీదుగా నిరూప్ ఫారెస్ట్ రోడ్డుగా పేరు పెట్టామని, ఇందుకు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కక్షలతో కూడిన రాజకీయం వల్ల అభివృద్ధి జరగదని .. వాటికి స్థానం లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసి చిత్తూరును అభివృద్ధి బాటలో నడిపిద్దామన్నారు. ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం మరో వారం రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో.. పార్టీలకతీతం గా ఆత్మీయ సమావేశం నిర్వహించడం ద్వారా సరికొత్త సంప్రదాయానికి నాంది పలుకుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశానికి సభ్యులందరూ తప్పక హాజరుకావాలని కోరారు. నగర మేయర్ ఎస్ అముద మాట్లాడుతూ.. గత ఐదేళ్ల కాలంలో నగర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామని, ఇందుకు సహకరించిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకు, డిప్యూటీ మేయర్లు, సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయకత్వంలో చిత్తూరు మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుత కౌన్సిల్ ఆఖరి సమావేశం కావడంతో.. డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కో - ఆప్షన్ సభ్యులు బావాద్వేగాలతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు సహకరించిన నగరపాలక అధికార యంత్రాంగానికి, ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో భాగంగా.. అజెండా, టేబుల్ అజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు. ప్రధానంగా నగరపాలక పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, రోడ్డు విస్తరణ పనులు, సిమెంట్ రోడ్లు, కాలువలు వంటి పనులకు ఆమోదం తెలిపారు. గంగినేని చెరువు పార్కు, ఇతర పార్కుల్లో పలువురు జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు, నగరంలో పలు వీధులు, రోడ్లకు పేర్లు పెడుతూ తీసుకున్న నిర్ణయాలను ఆమోదించారు. నగరపాలక పరిధిలో పలు ప్రాంతాలకు ఇదివరకే ఉన్న దళితవాడ, హరిజనవాడ, గిరిజనవాడ పేర్లను తొలగిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. కట్టమంచి వద్ద ఎస్టీపీ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. నగర కమిషనర్ పి నరసింహప్రసాద్ మాట్లాడుతూ.. నగర పాలక పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే, మేయరు, డిప్యూటీ మేయర్లు, సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. నగరాన్ని మరింతగా అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో చుడ చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగరపాలక అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**2026-27 బడ్జెట్ అంచనాలకు ఆమోదం**

నగరపాలక కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నగర మేయరు ఎస్ అముద అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో చిత్తూరు నగరపాలక సంస్థకు చెందిన సాధారణ నిధులు, ప్రభుత్వ గ్రాంట్లకు సంబంధించి 2025-26 సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలను, 2026-27కి సంబంధించిన రూ.289 కోట్ల బడ్జెట్ అంచనాలను ఆమోదించారు.

**సభ్యులకు సత్కారం**

నగరపాలక ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సభ్యులను ఘనంగా సత్కరించారు. మేయర్ ఎస్ అముద, డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు అందించారు. ఈ సందర్భంగా కౌన్సిల్, నగరపాలక సంస్థ తరఫున ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు పాల్గొన్నారు.



## చిత్తూరు జిల్లా

# మాజీ సైనికుల సంక్షేమ పట్ల ప్రత్యేక శ్రద్ధ

## - ఏపీ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్య ప్రసాద్ హామీ



**చిత్తూరు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యుల సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆంధ్రప్రదేశ్ సైనిక్ వెల్ఫేర్ (ఏపీ డబ్ల్యూఎఫ్ఆర్) డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం సైనిక్ వెల్ఫేర్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ ఎం బాలాజీతో కలిసి చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వార్ మెమోరియల్‌కు డైరెక్టర్ రూ.2,72,550 సహాయంగా అందజేశారు. అనంతరం పాత ఈహెచ్ఎస్ సమీపంలో సైనిక్ భవన్ నిర్మాణం కోసం కేటాయించిన 5 సెంట్ల స్థలాన్ని డైరెక్టర్ పరిశీలించి భవన నిర్మాణానికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో చర్చించారు. ఈ క్రమంలోనే జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో మాజీ సైనికులు, సంఘ ప్రతినిధులతో డైరెక్టర్ సమావేశమై, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలోని ఫైళ్లు, రిజిస్టర్లు కార్యాలయ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు, పలువురు మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భారీగా విరాళాలు



**రామకుప్పం,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలో త్వరలో ఏర్పాటు చేయనున్న మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు మండలంలోని తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు పెద్ద ఎత్తున విరాళాలు స్వచ్ఛంగా స్వచ్ఛం దంగా ఇస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పంద్యాలమడుగు పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మరియు మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలకు ఎన్టీఆర్ విగ్రహ స్థాపన కోసం బెంగళూరులో స్థిరపడిన పంధ్యాలమడుగు వాసి, మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత, ప్రముఖ బిల్డర్, సంఘ సేవకుడు రాజన్న తనవంతుగా రూ.లక్ష 116 వేలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మరియు స్థానిక తెదేపా ముఖ్య నేతలు రాజన్నను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ మునస్వామి మండల పార్టీ అధ్యక్షుడు మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పట్రా నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి కామ్రాజ్ నాయక్, ఎంపీటీసీ సులోచన గురప్ప, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణనాయక్, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, సింగల్ విండో అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, స్థానిక ముఖ్య నేతలు గంటలప్ప గౌడ్ ,శ్రీనివాస్ గౌడ్, చంద్రారెడ్డి, పట్రా సత్య, కడ మెంబర్ రఘు, భాస్కర్, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అవినాష్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పిఎస్‌కు చేరిన పదో తరగతి ప్రశ్నా పత్రాలు

**రామసముద్రం,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో భాగంగా ప్రశ్నాపత్రాలు మంగళవారం రామసముద్రం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. పరీక్షల గోప్యతను దృష్టిలో ఉంచుకొని అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశ్నాపత్రాలను స్టేషన్‌కు తరలించి భద్రపరిచారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకు పోలీసుల పర్యవేక్షణలోనే వాటిని భద్రంగా ఉంచనున్నట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పరిశీలిస్తూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# నిబంధనలు పాటించండి: ఎంవీఐ

**రామసముద్రం, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలో మంగళవారం ఎంవీఐ శివలింగయ్య వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని, ఫిట్‌నెస్ లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎంవీఐ శివలింగయ్య తెలిపారు. ఈ తనిఖీల్లో సంబంధిత సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరి చొరవతో మొదలైన రాకపోకలు



**కందుకూరు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కందుకూరు నుంచి చుట్టుగుంట వెళ్లే రోడ్డులో పల్లెవాగుపై పురాతన కల్వర్టు సోమవారం రాత్రి కుంగి పోయింది. 35 సంవత్సరాల క్రితం నిర్మించిన కల్వర్టు పైపులు పగిలిపోయి గుంత ఏర్పడింది. దీంతో కందుకూరు నుంచి చుట్టుగుంట మీదుగా ఉలవపాడుకు రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రాకపోకలు కొనసాగే విధంగా, కల్వర్టుకు ఏర్పడ్డ గుంత పూడ్చాలని మున్సిపల్ కమిషనర్ అనూషను ఆదేశించారు. దీంతో అధికారులు మట్టితో తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. కల్వర్టును పూర్తిగా మట్టితో పూడ్చడంతో రాకపోకలు మళ్లీ మొదలయ్యాయి.

# పట్ట పగలే బీర సాగు నేల మట్టం

## - రూ.3 లక్షలు ఆస్తి నష్టం



**బైరెడ్డిపల్లి,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మనుషుల ఎదుగుదలను చూసి ఓర్వలేక గ్రామాల్లో కొన్ని వింత చేష్టలు చేస్తుంటారు. మరీ కొంత మంది భిన్నంగా కష్టపడి పోటీ పడతారు. కానీ బైరెడ్డిపల్లి మండలంలో జరిగిన ఘటన రైతన్నలను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నది. ఏకంగా కోతకొచ్చిన పంటను నెల మట్టం చేశారు. సమాజం ఎటు పోతుందో ఒక్కసారి చూడండి. మండలంలోని వీకోట కు వెళ్లే జాతీయ రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ పక్కన సుబ్రమణ్యం అనే రైతన్న 2 ఎకరాలు బీర సాగు చేశారు. సుమారు రూ.3 లక్షలు ఖర్చు పెట్టి, స్టేకింగ్ పద్ధతిలో పందేరు వేసి సాగు చేస్తే మంగళవారం పట్టపగలే 9.00 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు పంటను నేల మట్టం చేశారు. ఈ సందర్భంగా రైతన్న మాట్లాడుతూ జాతీయ రహదారిలో అను నిత్యం వాహనాలు ప్రయానిస్తుంటాయి. మా పొలం పక్కనే ఇంట్లో మనుషులు ఉంటారు. కానీ ఈరోజు అనంగానే పచ్చి మిర్చి కోతలో కుటుంబీకులు, కూలీలు నిమగ్నమవగా ఎవ్వరు లేని సమయం చూసి గుర్తు తెలియని కేటుగాళ్ళు 2 ఎకరాల బీర సాగును నెల మట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో ధరలు పుంజుకొంటున్న సమయంలో ఎవ్వరో గిట్టని వారు ఈ దుర్మారకపు పనికి వడిగట్టారని తెలుపారు. ఏది ఏమైనా పంటలపై ప్రతాపం చూపడం ఇది ఒక దుర్మారకపు చర్యని పలువురు ఖండిస్తున్నారు.

# మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ



**బైరెడ్డిపల్లి,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో మంగళవారం ఉదయం మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లి మండలానికి చెందిన గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ చంద్రన్ మాట్లాడుతూ ప్రత్యేకించి గర్భిణీలకు చికిత్సలు, ఆరోగ్యంపై జాగ్రతలు తెలియజేస్తున్నాం, వాటిని తప్పక పాటించాలన్నారు. గర్భం దాల్చిన నాటి నుండి ప్రశవం వరకు ఆరోగ్యంపై ఎన్ని జాగ్రత్తలు పాటిస్తే అంత మంచిది భవిష్యత్తులో ఆరోగ్యంపై పడే ఎఫెక్ట్‌ను ముందస్తుగా మేల్కోవాలని కోరారు. పౌష్టికాహారం లోపిస్తే శరీర ఎదుగుదల ఆగిపోవడం, బలహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం, అనీమియా, విటమిన్ల లోపం వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. పిల్లల్లో ఇది శారీరక, మానసిక వికాసాన్ని దెబ్బతీస్తుంది, అలాగే ఎత్తు, బరువు తగ్గడం వంటి సమస్యలకు కారణమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, మహతి ఫౌండేషన్ శ్రీనివాసులు, గర్భిణీలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పయనిద్దాం: ఎమ్మెల్సీ



**రామకుప్పం, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజలే దేవుళ్ళు సమాజమే దేవాలయం అన్న నినాదంతో పేదవాడికి కూడు నీడ గుడ్డ కల్పించాలన్న మహత్ సంకల్పంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి పేదవాడి గుండెల్లో ప్రపంచ తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు చూపిన బాటలో పయనిద్దామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కుప్పం ఏరియా డెవలప్మెంట్ కమిటీ అఫీయల్ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం రామకుప్పం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సర్కిల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎన్టీఆర్ విగ్రహ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ శ్రేణులు మరియు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గతంలో ఢిల్లీ పుర వీధుల్లో తెలుగు జాతి ఖ్యాతిని నిలబెట్టి తెలుగుదేశం పార్టీ అంటే కేవలం ఆంధ్ర రాష్ట్రానికే కాదు భారతదేశ భవిష్యత్తు నిర్మించడంలో ముఖ్య భూమిక పోషించడానికి సిద్ధంగా ఉందని చాటి చెప్పారని దీనికి ఉదాహరణ గతంలో అనేకమంది ప్రధానులు, రాష్ట్రపతులు, లోకసభ స్పీకర్ వంటి ఉన్నత స్థానాలను పొందడానికి ఉత్తమ నేతలను సిఫారసు చేసిందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులందరూ ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ఆయన చూపిన బాటలో పయనిస్తూ ప్రజల అభిమానాన్ని పొందే విధంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ వైద్యం శాంతారాం, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ మునస్వామి, కుప్పం మార్కెట్ కమిటీ చైర్మన్ జీఎం రాజు, మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి కామ్రాజు నాయక్, నియోజకవర్గ ముఖ్య నేతలు ప్రేమ్ కుమార్,బాబు నాయుడు, విశ్వనాథ్ నాయుడు, బెట్టప్పనాయుడు, చెక్కునత్తమ్ మణి , స్థానిక ముఖ్య నేతలు చిన్ని కృష్ణ చలపతి, సీతాపతి,పట్రా నారాయణ, నరసింహులు, ఎంపీపీ సులోచనగురప్ప, మహమ్మద్ రఫీ, జయశంకర్, కృష్ణ నాయక్, రఘు, గంటలప్ప గౌడు, రామకృష్ణప్ప, రాజన్న, పద్మనాభ రెడ్డి, అవినాష్ రెడ్డి, బాలకృష్ణ అల్లి శ్రీను, ఆదిల్. దయ,భాస్కర్, సురేష్, సుబ్రీ, పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## - ఈ సైకిళ్ళు, బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



**పలమనేరు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆర్థికంగా సామాజికంగా పురుషులతో సమానంగా మహిళలను అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తేనే దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఎలక్ట్రానిక్ సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. దాంతోపాటు ప్రతి మహిళ ఓ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే నేడు చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకొని విరివిగా రుణాలు సైతం అందిస్తున్నామన్నారు. కాబట్టి మహిళలుసామాజిక,ఆర్థిక,రాజకీయ, విద్యా రంగాలలో పురుషులకు ధీటుగా రాణించాలని ఆయన సూచించారు. మహిళలు పురుషులతో సమానంగా ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే రాష్ట్ర దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఏ ప్రభుత్వమైనా సుస్థిరంగా ఉన్నపుడే అభివృద్ధి సంక్షేమం జరుగుతుందని ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.రాబోయే ఎన్నికల్లో సైతం కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలబడి అభివృద్ధి, సంక్షేమానికి అనంతరం మున్సిపల్ పరిధిలోని 508 స్వయం సహాయక సంఘ గ్రూపులకు రూ.69.10 కోట్ల బ్యాంక్ లింకేజి, సెల్ఫ్ ఎంప్లాయ్ మెంట్ ప్రోగ్రామ్ ద్వారా 75 మందికి రూ. 1.65 కోట్లు, ఇద్దరు లబ్ధిదారులకు ఉచితంగా ఎగ్ కార్ట్స్‌ను ఆయన పంపిణి చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీకి చెందిన 258 మంది లబ్ధిదారులకు ఈ-సైకిళ్లను ఆయన అందజేశారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కటింగ్ ఇలా ఉండగా అసెంబ్లీ సమావేశాల కారణంగా ఈ నెల 8న మహిళా దినోత్సవం రోజున ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆ వేడుకను ఈ సందర్భంగా జరుపుకున్నారు. దీంతో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, డిఆర్డిఏ పీడి శ్రీదేవిల ఆధ్వర్యంలో గ్రూప్ మహిళలు కేక్ ను కట్ చేసి వేడుక జరుపుకున్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న ఆర్పీలు, మున్సిపల్ సిబ్బందిని ఈ సందర్భంగా వారు సన్మానించి బహుమతులను అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ఎస్వీ రమణా రెడ్డి,మెప్మా అధికారి బాబా, బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, నాయకులు గిరి, సుబ్రహ్మణ్యం గౌడ్, ఖాజా, నాగరాజు, కిరణ్, బిఆర్సి కుమార్, క్రిష్ణ మూర్తి,మదన్, శ్రీధర్, భాస్కర్ యాదవ్, సుధాకర్, డైరెక్టర్ నదీమ్, మేదర వెంకటరమణ, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షురాలు పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# అపోలో వర్సిటీలో అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి వర్క్‌షాప్



**చిత్తూరు,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మురకంబట్టులోని ది అపోలో యూనివర్సిటీలో అకాడమిక్ అఫైర్స్ డైరెక్టరేట్, మానవ వనరుల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌ప్రొఫెషనల్ అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా "ఎంగేజ్, ఇంటరాక్ట్, టీచ్: లార్జ్ అండ్ స్మాల్ గ్రూప్ టీచింగ్ స్ట్రాటజీస్"పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. అధ్యాపకులు పెద్ద, చిన్న విద్యార్థి సమూహాల్లో సమర్థవంతంగా బోధన చేయడానికి అవసరమైన ఆధునిక బోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. క్యాంపస్‌లోని డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ది అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒక విశ్వవిద్యాలయం నాణ్యత ప్రధానంగా అక్కడి అధ్యాపకుల నైపుణ్యం, బోధన పద్ధతులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. సమర్థవంతమైన టీచింగ్-లర్నింగ్ విధానాలు అమలు చేసినప్పుడే విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక దృక్పథం పెరుగుతాయని అన్నారు. ఎఐఎంఎస్ఆర్‌లో అమలవుతున్న ఆధునిక మెడికల్ ఎడ్యుకేషన్ మోడల్స్ మంచి ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొంటూ, అలాంటి వినూత్న బోధన పద్ధతులను ఇతర విభాగాల్లో కూడా అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఎఐఎంఎస్ఆర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ సచ్చిదానంద అడిగ, ఎఐఎంఎస్ఆర్ పాథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి బ్రహ్మయ్య రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్నారు. వారు తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచే విధానాలు, చిన్న, పెద్ద సమూహాల్లో బోధనను సమర్థవంతంగా నిర్వహించే పద్ధతులపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ జె.అగస్టిన్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డి.జగదీషన్, ఎసిఎఫ్ అసిస్టెంట్ డీన్ డాక్టర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ విభాగాల అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి: ఎమ్మెల్యే



**మదనపల్లె, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**ఎంపీడీవో కార్యాలయం నందు పంచాయతీ సెక్రటరీలతో ఎంపీడీవో తాజ్ మస్రూర్ ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరై పరిస్థితులు అరా తీశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం ప్రారంభమైన దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, దోమలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో రోడ్లు, మురికి నీటి కాలువలతో ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సెక్రటరీలు పాల్గొన్నారు.

## విజయవంతంగా ప్రదర్శించబడుతున్న విధాత చిత్రం

**- శ్రీ గుడ్ విల్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్**



**మదనపల్లె, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**విధాత చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుని విజయవంతంగా ప్రదర్శించబడుతోందని శ్రీ గుడ్ విల్ కంప్యూటర్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్ అన్నారు .మంగళవారం తమ సంస్థ సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఆయన సాయి చిత్ర థియేటర్ నందు సినిమా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా. అప్పినపల్లి భాస్కరాచారి హీరోగా నటించడంతోపాటు తన సొంత బ్యానర్ అయిన ఏబిసి ప్రొడక్షన్‌పై విధాత చిత్రం నిర్మించడం జరిగిందన్నారు. అలాగే ఈ సినిమాకు మణికంఠ రాజేంద్ర బాబు దర్శకత్వం వహించారని చెప్పారు. మదనపల్లె కు చెందిన ఎంతోమందిని ఈ చిత్రం ద్వారా వెండితెరకు పరిచయం చేసిన ఘనత డా. అప్పినపల్లి భాస్కరాచారి కే దక్కుతుందని అభినందించారు. ముఖ్యంగా మదనపల్లె పరిసర ప్రాంతాలు గ్రామాలను ఈ చిత్రంలో ఎంతో చక్కగా చూపించారని కొనియాడారు. దర్శకుడిగా మణికంఠ రాజేంద్ర, హీరోగా డా.అప్పినపల్లి భాస్కరాచారి,ప్రతి నాయకుడిగా శివారెడ్డి నటన,అప్పలబట్ల సురేష్ రచన అద్భుతంగా ఉన్నాయని కితాబునిచ్చారు. ప్రతి ఒక్కరు ఈ సినిమాను కుటుంబ సమేతంగా తిలకించాలని గుడ్ విల్ కంప్యూటర్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కుమార్ కోరారు.

## క్యాన్సర్ రహిత భవిష్యత్తుకై బాలికలకు హెచ్.పి.వి టీకా



**పీలేరు,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బాలికకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రహిత భవిష్యత్ కోసం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తలపెట్టిన హెచ్.పి.వి టీకా మంగళవారం తలుపుల పి.హెచ్.సీలో బాలికలకు వేశారు. తలుపుల పి.హెచ్.సి పరిధిలో 14 సంవత్సరాల బాలికలను 172 మందిని లబ్ధిదారులగా ఇంటింటి సర్వేద్వారా గుర్తించామని.14 సంవత్సరాలు పూర్తయి ఇంకా 15 సంవత్సరాలు పూర్తికాని బాలికలు టీకాలకు అర్హులని మొత్తం జనాభాలో వీరు కేవలం 1% శాతం ఉంటారని,గుర్తించిన బాలికలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోనే ఈ టీకా డాక్టర్లు, తల్లిదండ్రుల పర్యవేక్షణలో వేస్తారని, ఈ టీకా పూర్తి సురక్షితమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తలుపుల ప్రదాన వైద్యాధికారులు డా.శ్రీగిరీష, డా.చంద్రశేఖర్ సంయుక్తంగా తెలిపారు. కార్యక్రమంలో పి.హెచ్.సి పరిధిలోని అందరూ పర్యవేక్షణ అధికారులు, ఓ.పి సిబ్బంది,ఏ.యన్.యంలు ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మల్చింగ్ షీట్ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**- వ్యవసాయ, ఉద్యానవన అధికారులు హెచ్చరిక**



**మదనపల్లె,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రస్తుతం టమాటో పంట సాగుకు మల్చింగ్ షీట్ అవసరమైన ముఖ్యమైన వస్తువు కనుక కొన్ని షాపుల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు మల్చింగ్ షీట్ విక్రయించే షాపులపై వ్యవసాయ ఉద్యాన, సేల్స్ టాక్స్ అధికారులు మంగళవారం ఉమ్మడిగా తనిఖీలు చేశారు.ప్రస్తుతం అన్నిషాపులలో పాత స్టాకు మాత్రమే ఉన్నది. కావున పాత స్టాక్ అయిపోయే వరకు పాత రేట్లకే మల్చింగ్ పేపర్ అమ్మకాలు జరగాలని సూచించారు. ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధ పరిస్థితుల కారణంగా మల్చింగ్ షీట్ తయారీకి వాడే ముడి సరుకుల విలువ పెరగడం వలన కొత్తగా తయారయ్యే మల్చింగ్ షీట్ ధరలలో రోల్‌కి రూ.250 నుంచి రూ.350 వ్యత్యాసం ఉండవచ్చుని షాపు యాజమాన్లు తెలియజేశారు.అలాగే ప్రతి ఒక్క రైతు మల్చింగ్ షీట్ కొనే షాపులలో జీఎస్టి బిల్లు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఇంకనూ ఏ షాపు యజమానులైనా అధిక ధరలకు విక్రయించినా లేదా జియస్టి బిల్లులు ఇవ్వకున్నా రైతులు నేరుగా మీ మండల వ్యవసాయ, ఉద్యాన లేదా సేల్స్ టాక్స్ అధికారులను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లె ఉద్యాన అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ సేల్స్ టాక్స్ ఆఫీసర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి టీకా ప్రచార పోస్టర్ విడుదల



**మదనపల్లె, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**గర్భాశయ క్యాన్సర్ నుండి కౌమారదశ బాలికలను రక్షించేందుకు ఆరోగ్య శాఖ చేపట్టిన హెచ్‌పివి (హ్యూమన్ పాపిల్లోమావైరస్) టీకా ప్రచార పోస్టర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... జిల్లాలో హెచ్‌పివి టీకా ప్రచార కార్యక్రమం కింద 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పివి టీకా అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు తీసుకువెళ్లి టీకా వేయించుకోవాలని కోరారు.భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పివి టీకా సురక్షితమైనదిగా, ప్రభావవంతమైనదిగా ఆరోగ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉషశ్రీ, కలెక్టరేట్ ఏవోనాగభూషణం, మదనపల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి ఎమ్మార్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్ కమ్ ఎగ్జిబిషన్

**- మదనపల్లెలో మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్**

**- డి.వి.ఎస్.ఆర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్, ఏంఎస్ఎంఇ-డీఎఫ్ఓ, విశాఖపట్నం**

**మదనపల్లె, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్(ఎంఎస్ఎం ఈ –డిఎఫ్ఓ) విశాఖపట్నం ఆధ్వర్యంలో, జిల్లా పరిశ్రమల కేంద్రం(డిఐసి), డిఆర్‌డిఎ, మెప్మా అన్నమయ్య జిల్లా సహకారంతో నిర్వహిస్తున్న పిఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్ కమ్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వి.ఎస్.ఆర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్, ఏంఎస్ఎంఇ –డీఎఫ్ఓ, విశాఖపట్నం. ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన మార్చి 13 నుండి 15 వరకు మదనపల్లె లోని పద్మావతి కళ్యాణ మండపం, శివాజీ నగర్, సీటీఎం రోడ్ వద్ద ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పిఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్ కమ్ ట్రేడ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో 50కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేసి, విశ్వకర్మ పథకానికి చెందిన వివిధ సంప్రదాయ వృత్తుల కళాకారుల ఉత్పత్తులు, పనితీరును ప్రదర్శించనున్నారు. కార్యక్రమానికి సాధారణ ప్రజలు, సందర్శకులు, ఎం ఎస్ ఎం ఈ ప్రతినిధులు, చేతివృత్తులవారు అందరూ ఉచితంగా ప్రవేశించి సందర్శించవచ్చని అధికారులు సూచించారు. వివరాల కోసం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డి.వి.ఎస్.ఆర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్‌ను 9492689462 సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని విధంగా పత్రిక ద్వారా విస్తృత ప్రచారం, కవరేజ్ అందించి విజయవంతం చేయాలని కోరారు.

## వాసవి క్లబ్‌చే పలు వితరణలు ప్రెసిడెంట్ వివి కృష్ణారావు వెల్లడి




**మదనపల్లె, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్ధ సూర్యప్రకాశరావు, మదనపల్లె వాసవి క్లబ్‌కు గుడ్ విల్ విజిట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అసహాయులకు ఆసరా కింద మదనపల్లె పట్టణం సిటిఎం రోడ్డు లోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో భోజనం తయారు చేయడానికి శాశ్వతంగా పనికివచ్చే వస్తు సామాగ్రి విరాళంగా ఇవ్వడం జరిగింది. అదే విధంగా చైతన్య వృద్ధాశ్రమానికి హైడ్రాలిక్ మంచం వితరణ చేయడం జరిగింది. అలాగే పర్మినెంట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు నాలుగు సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే వనిత క్లబ్ ఆధ్వర్యంలో బాలసదన్‌కు వెయ్యి లీటర్ల నీళ్ళ ట్యాంకు వితరణ చేశారని వాసవి క్లబ్ ప్రెసిడెంట్ వివి కృష్ణారావు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమాలకు దాతలుగా దేవకి మణిదీప్, ఓలేటి వినయ్ కుమార్, సూరే విజయ్ కుమార్, మదల్లపల్లె నాగరాజు, కోటా చంద్రశేఖర్ గుప్తా, అక్కిశెట్టి శ్రీనాథ్, అక్కి శెట్టి జ్యోతి సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు సిద్ధ సూర్య ప్రకాశరావు, వనిత క్లబ్ ప్రెసిడెంట్ సరళ, సెక్రటరీ అనిత, కోశాధికారి యం. వైశాలి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ వివి కృష్ణారావు, సెక్రటరీ ఈ వినయ్ కుమార్, ట్రెజరర్ చంద్రశేఖర్ గుప్తా మరియు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## డిజిటల్ ట్విన్ టెక్నాలజీతో రోబోటిక్ శస్త్రచికిత్సలలో పురోగతి

**- మిట్స్ యూనివర్సిటీలో ఒకరోజు సాంకేతిక ఉపన్యాసం**



**మదనపల్లె /కురబలకోట, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మిట్స్ డీమ్డ్ టుబి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) విభాగం వారు ఏఐసిటిఈ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి),న్యూఢిల్లీ వారి సహకారంతో డిజిటల్ ట్విన్ టెక్నాలజీతో దూరం నుండి రోబోటిక్ శస్త్రచికిత్సలలో జరిగిన తాజా అభివృద్ధులు అనే అంశంపై ఒక రోజు సాంకేతిక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ టి.వెంకట ప్రభాకర్,ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) బెంగళూరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ ట్విన్ టెక్నాలజీ ఆధారంగా దూరం నుండీ నిర్వహించే రోబోటిక్ శస్త్రచికిత్సల రంగంలో ఇటీవలి కాలంలో గణనీయమైన పురోగతి కనిపిస్తోందన్నారు. డిజిటల్ ట్విన్ అనేది రోగి శరీర భాగాల యొక్క వాస్తవ స్థితిని ప్రతిబింబించే వర్చువల్ నమూనా అని,ఈ నమూనా సహాయంతో వైద్యులు శస్త్రచికిత్సకు ముందు కంప్యూటర్‌లోనే ప్రక్రియను అనుకరించి, త్యంత కచ్చితంగా ప్రణాళిక రూపొందించగలరన్నారు.ఈ విధానం ద్వారా శస్త్రచికిత్స సమయంలో ప్రమాదాలను తగ్గించడం, కచ్చితత్వాన్ని పెంచడం సాధ్యమవుతుందని తెలిపారు. బెంగళూరు మరియు చెన్నై మధ్య సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవస్థను నెట్‌వర్క్, హ్యాప్టిక్ పరికరాల ద్వారా అనుసంధానించి, వైద్యులు దూరం నుంచే శస్త్రచికిత్సలు చేయగల విధానాన్ని వివరించారు.డిజిటల్ ట్విన్ వ్యవస్థలు శస్త్రచికిత్స సమయంలో రోగి శరీర పరిస్థితులను నిరంతరం విశ్లేషిస్తూ వైద్యులకు రియల్–టైమ్ సమాచారాన్ని అందిస్తాయి.దీనివల్ల శస్త్రచికిత్స మరింత సురక్షితంగా వేగంగా, కచ్చితంగా చేయడం సాధ్యమవుతోంది. అలాగే ఈ టెక్నాలజీ వైద్య విద్య, శిక్షణ, శస్త్రచికిత్స ప్రణాళికలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. డిజిటల్ ట్విన్ టెక్నాలజీ, రోబోటిక్ వ్యవస్థల కలయికతో భవిష్యత్తులో వైద్య రంగం మరింత ఆధునికంగా మారే అవకాశం ఉందని, విద్యార్థులు మరియు అధ్యాపకులు భవిష్యత్తు వైద్య సాంకేతికతల అభివృద్ధి కోసం పరిశోధనలకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఆర్.కల్పనా, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రామప్రియా, కో కో ఆర్డినేటర్ జె.విశ్వనాథ్, డాక్టర్ చొక్కనాథన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి సిబ్బాల చంద్రమోహన్(చిట్టి)కి సత్కారం

**కలకడ, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసినటువంటి సిబ్బాల చంద్రమోహన్(చిట్టి)ని డి.వి.ఎం.సి సభ్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, గిరిజన యానాది సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్ మంగళవారం కలకడ మండలం కోన గ్రామం నందు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి దృశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన సిబ్బాల చంద్రమోహన్‌కి టిడిపిలో కీలకమైన పదవి రావడం బలహీన వర్గాల ప్రజల సంతోషదగ్గ విషయమని భవిష్యత్తులో సిబ్బాల చంద్రమోహన్ మరిన్ని ఉన్నత పదవులు అవరోధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజల అభివృద్ధికి తోడ్పాటు అందించి బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలవాలని వీరు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోన మాజీ సర్పంచ్ గుద్దిటి త్యాగరాజు, టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సాదు రామాంజులు, పాలకుంట చౌడప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## నా మనువరాలికి ప్రాణభిక్ష పెట్టండి!

**- సీఎంకు టిడిపి నాయకుడు అన్వర్ బాషా వేడుకోలు**



**మదనపల్లె,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నా మనవరాలు భయంకరమైన వ్యాధితో జీవన్మరణ పోరాటం చేస్తుందని, కూటమి నాయకులు ఆదుకొని నా మనువరాలికి ప్రాణభిక్ష పెట్టాలంటూ తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి అన్వర్ బాషా అర్థిస్తున్నాడు. ఈ మేరకు మంగళవారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి తన ఆవేదనను వెల్లబుచ్చాడు.ఈ సందర్భంగా అన్వర్ బాషా మాట్లాడుతూ తన మనవరాలు ఆలియా ఆనంకు ఏడాది వయసు కూడా లేదని,అయితే ఇంత చిన్న వయసులోనే యూరిన్ సైకిల్ డిఫెక్ట్ అనే భయంకరమైన వ్యాధితో జీవన్మరణ పోరాటం చేస్తోందన్నారు. తనకున్న ఇంటిని మార్టిగేజ్ చేసి సుమారు రూ.12 లక్షలు వరకు ఖర్చుపెట్టి బెంగళూరు సెయింట్ జాన్స్ ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నప్పటికీ పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉందన్నారు.మరో రూ.20 లక్షలు అయితే గానీ బిడ్డను కాపాడలేమని డాక్టర్లు చెబుతున్నారని,తన వద్ద ఉన్నదంతా ఊడ్చి పెట్టేశానని, నా మనవరాలు ప్రాణాలు దక్కించుకోవడానికి నాకు వేరేమార్గం కనబడడం లేదన్నారు. తాను తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు వీరవిధేయుడిగా బలమైన కార్యకర్తగా పనిచేశానని, తెలుగుదేశం పార్టీ ప్రయాణంలో 43 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం సాగించానన్నారు. ప్రస్తుతం నా మనవరాలిని కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముందుకొచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తన మనువరాలికి ప్రాణభిక్ష పెట్టమని అర్థిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. నాయకులు స్పందించి ఒక కార్యకర్త మనువరాలిని ఆదుకోవాల్సి ఉంది.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత

**- ఆసుపత్రి సూపరింటెండెంటుకి బీవైఎస్ వినతి**

**మదనపల్లె, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్రమందులు కొరత ఉందని బీవైఎస్ వ్యవస్థాపకులు పునీత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బీవైస్ నాయకులతో కలిసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి మరియు జిల్లా కలెక్టర్‌లకు విజ్ఞప్తి,ఒకవేళ ఆసుపత్రిలో మందులు సరఫరా చేయలేకపోతే,వెంటనే ఆసుపత్రి ప్రాంగణంలో ఈ ఆసుపత్రిలో మందులు అందుబాటులో లేవని తెలుగులో బోర్డు ఏర్పాటు చేయండి.తద్వారా పేద ప్రజలు ఆశతో వచ్చి మోసపోకుండా ఉంటారని తెలిపారు. వేలాది మంది పేద ప్రజలు ఆధారపడే ఈ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కనీసం దగ్గు మందు వంటి సాధారణ మందులు కూడా లేకపోవడంతో పేద రోగులు ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్లాల్సి వస్తోంది. సైకియాట్రిక్ వార్డులో అత్యవసర మందులు లేవని,ఖరీదైన ఈ మందులను బయట కొనలేక మానసిక రోగుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. సమస్య తెలిసినా పట్టించుకోని అధికారుల తీరు వల్ల ఉచిత వైద్యం అనేది కేవలం మాటలకే పరిమితమైందన్నారు. కావున జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని మందుల నిల్వలపై విచారణ జరిపించాలని, యుద్ధ ప్రాతిపదికన మందులను సరఫరా చేసి పేదలకు భరోసా కల్పించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బివైఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నిస్సార్ అహమ్మద్‌ను పలకరించిన మాజీ సీఎం జగన్

**- ఈనెల18న విజయవాడలో ఇఫ్తారు విందు**



**మదనపల్లె, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మైనారిటీల పక్షాన నిలబడే ఏకైక పార్టీ వైయస్సార్‌సిపి అని నిరంతరం ప్రజలకు చేరువగా వుంటూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టాలని మాజీ మంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్‌సిపి సమన్వయకర్తలకు సూచించారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డిని మాజీ ఉప ముఖ్యమంత్రి అమ్‌జాద్ బాషా తోకలిసి మదనపల్లె వైయస్సార్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మగ్బుల్ సాహెబ్, నూరీ ఫాతిమా, ఖాదర్ బాషా, హఫీజ్ ఖాన్, రుహుల్లా ఇఫ్తారు విందుపై చర్చించడానికి కలవడం జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు ఇఫ్తారు విందు నిర్వహణలో ఉన్న ఇబ్బందులు చర్చించారు. దీనిపై ముస్లిం మైనారిటీ నేతల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఈనెల 18న విజయవాడలో నిర్వహించాలని వైఎస్.జగన్మోహన్ రెడ్డి నిర్ణయించారు. మదనపల్లె వైయస్సార్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్‌ను వైయస్సార్ సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్‌తో మాట్లాడారు. ప్రజలకు చేరువగా చేపట్టిన పార్టీ కార్యక్రమాలపై అభినందించారు. కూటమి ప్రభుత్వం అవలభిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకుని వెళ్లడానికి ముందుండాలని సూచించారు.

## టీబి, క్షయ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ములకలచెరువు,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీబి, క్షయ వ్యాధిగ్రస్తులు ఎప్పటికప్పుడు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని తంబళ్లపల్లి టీవీ యూనిట్ కన్సల్టెంట్ డబ్ల్యూహెచ్ఓ డాక్టర్ నితీష్ రామ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని వైద్యశాలను ఆయన సందర్శించారు. వైద్యశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని కాల్వపల్లి పంచాయతీలో గల క్షయ, టీబీ వ్యాధిగ్రస్తులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి వైద్యులు సూచించిన మేరకు మందులు వాడకం చేపట్టాలన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు వ్యాప్తి నివారణ పరీక్షలు ఉచిత చికిత్స అందించే విషయాల గురించి తెలియజేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల చికిత్స కాలంలో ప్రభుత్వం రూ.6 వేలు పారితోషకం వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తంబాలపల్లి క్షయ వ్యాధి నివారణ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ ఉషారాణి, డాక్టర్ అరవిందల ఔదార్యం

**- తల్లిదండ్రులు లేని ఐదుగురు పిల్లలకు ఉపకార వేతనం**



**మదనపల్లె,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మడకశిర మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, వారి మనవడు రక్షన్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని డాక్టర్ ఉషా రాణి, డాక్టర్ అరవింద (మణిపాల్ హాస్పిటల్ బెంగళూరు) వారు మంగళవారం ఐదుమంది తల్లిదండ్రులు లేని పిల్లలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున స్కాలర్షిప్స్ అందజేశారు. కరోనాలో తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులు,మరియు ఏ ఇతర కారణాల వలన అమ్మానాన్నలు లేని చిన్నారులలో ఐదుమందిని దత్తత తీసుకొని వారి పూర్తి బాధ్యతను డాక్టర్ ఉషారాణి,డాక్టర్ అరవిందలు తీసుకున్నారు. గతంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు వారి కుటుంబ సభ్యులు చేస్తున్నప్పటికీ ఇవాళ ఉషారవిందని నామకరణంతో తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు ఆర్థికంగా భరోసాన్ని అందించేందుకు స్కాలర్షిప్ ప్రోగ్రాంని లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉందని వారి కుటుంబ సభ్యులు సుజాత, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి కొనియాడారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కోల్పోయిన 5 మంది చిన్నారులు వారిని చూసుకునే గార్డియన్స్, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి,సుజాత,ధాత్రి ఫౌండేషన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వినీత, చక్రపాణి, ఆనంద నిలయంలోని వృద్ధులు పాల్గొన్నారు.

# ఇంధన ధరలు దిగి వస్తాయి!

## -త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది: ట్రంప్ సంచలన ప్రకటన



**వాషింగ్టన్,మార్చి10(ఆర్ఎన్ఎ):** ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతుందని,వెనక్కి తగ్గేది లేదన్న ట్రంప్ కొంత మెత్త బడ్డారు. వెనక్కి తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఇరాన్ కూడా గట్టి హెచ్చరికలు చేయడంతోనో ఏమో యుద్ధానికి త్వరలోనే ముగింపు దొరుకుతుందని అన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, చమురు ధరలు కిందకు దిగి వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి చేరువలో ఉన్నామని, ఇరాన్‌పై దాడిని, మధ్యప్రాచ్యంలోని చెడును వదిలించడానికి అమెరికా చేసిన విహారయాత్రగా ట్రంప్ అభివర్ణించారు. ఆ విహారయాత్ర స్వల్పకాలికంగానే ఉంటుందని తెలిపారు. మియామి గోల్ఫ్ క్లబ్‌లో రిపబ్లికన్ చట్ట సభ్యులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ప్రసంగించారు. 'ఇరాన్ యుద్ధం ఈ వారంలోనే ముగుస్తుందా' అనే ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. 'లేదు. కానీ త్వరలోనే ముగుస్తుంది' అని జవాబిచ్చారు. 'మా సైనిక లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా పెద్ద అడుగులు వేస్తున్నాం. ఇరాన్‌లోని బలగాలను పూర్తిగా తుడిచిపెట్టేశాం. అంతర్జాతీయ చమురు సరఫరాకు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. అలా చేస్తే ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. మెరికా, ఇజ్రాయెల్‌పై దాడిని పొడిగించేందుకు ఇరాన్‌కు తగినంత సామర్థ్యం లేదు కాబట్టి, యుద్ధం త్వరలోనే ముగిసిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఆయన వారసుడిగా మొజ్తాబా ఖమేనీ ఎంపికైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను ఎంపిక చేయడం పట్ల తాను చాలా నిరాశ చెందానని, అయితే కొత్త సుప్రీం లీడర్‌పై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని ట్రంప్ తెలిపారు.

# ఇరాన్ యుద్ధప్రభావంతో ధరల మోత

### -గ్యాస్ ధరలు పెరగడంతో పెట్రో ధరలపై ఆందోళన
### -ఇప్పటికిప్పుడు ప్రమాదం లేదని వెల్లడించిన కేంద్రం

**న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మనదేశ నిత్యావసరాలపై తీవ్ర ప్రభావం చూపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు ఆటంకం ఏర్పడడంతో, అతి త్వరలోనే వీటి నిల్వలు నిండుకుంటాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సంర్భంలో గ్యాస్ ధరలు పెరిగాయి. అలాగే పెట్రో ధరలు పెరుగాయని అంటున్నారు. వీటి ప్రభావంతో నిత్యాసవరాలు కూడా పెరగక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ముఖ్యంగా పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలను ఖండించింది. కొంతపాలం పాటు నష్టాలను చమురు కంపెనీలు భరిస్తాయని వెల్లడించింది. రాబోయే 6 నుంచి 8 వారాల వరకు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోల్ నిల్వలు ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. అలాగే ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు కూడా ప్రస్తుతానికి సరిపోతాయని పేర్కొంది. అయితే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు ఈ వ్యవధి 21 రోజులు ఉండేది. మనదేశంలో సగటున ఒక కుటుంబం ఏడాదికి 7 నుంచి 8 సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. లాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది .

# గ్యాస్ సిలిండర్లకు కొరత

### -హోటల్ పరిశ్రమకు గ్యాస్ అలభ్యత -ఇప్పటికే మూతపడ్డ 20 శాతం హోటళ్లు
### -గ్యాస్ దొరకకపోతే మూసివేత తప్పదన్న యాజమాన్యాలు



**న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా ఎల్పీజీ కొరత ఏర్పడింది. గ్యాస్ కంపెనీలు ఎల్పీజీ సిలిండర్ల ధరను భారీగా పెంచేశాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లతో పాటు డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధర పెరిగింది. డొమస్టిక్ సిలిండర్లపై 60 రూపాయలు.. కమర్షియల్ సిలిండర్లపై 115 రూపాయలు పెరిగింది. అంతేకాదు.. వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా నిలిచిపోయింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవటంతో బెంగళూరు, చెన్నై, ముంబైలలోని హోటళ్లు, రెస్టారెంట్లపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నగరాల్లోని దాదాపు 20 శాతం హోటళ్లు మూతపడ్డాయి. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబయి లో 20శాతం హోటళ్లు, రెస్టారంట్లు మూతపడ్డాయని హెటల్ హోటల్ అండ్ రెస్టారంట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడతాయని పేర్కొన్న సంగతి తెలిసిందే. 'ది బెంగళూరు హోటల్స్ అసోసియేషన్' ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో.. 'గ్యాస్ సరఫరా నిలిచిపోవటంతో.. హోటల్స్ మూతపడనున్నాయి. భోజనం కోసం హోటల్స్‌పై ఆధారపడిన సాధారణ ప్రజలు, విద్యార్థులు, మెడికల్ ప్రొఫెషనల్స్ ఇబ్బందులు పడకతప్పదు. గ్యాస్ సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు మా హోటల్ ఇండస్ట్రీ ఇబ్బందులు పడక తప్పదు. ఈ విషయంలో కేంద్రం త్వరగా సరైన చర్యలు తీసుకోవాలి' అని పేర్కొంది. చెన్నై హోటల్స్ అసోసియేషన్ కూడా ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో .. 'పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే డిస్ట్రిబ్యూటర్లు గ్యాస్ సిలిండర్ల సప్లైని పూర్తిగా ఆపేశారు. స్టాక్ లేదని అంటున్నారు. దీని ఫలితంగా చాలా హోటళ్లు బలవంతంగా మూసేయాల్సి వస్తోంది' అని పేర్కొంది. 'ది నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'.. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాపై స్పందించింది. ఈ మేరకు సోమవారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'రెస్టారెంట్ ఇండస్ట్రీకి కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాపై ఎటువంటి నిషేధం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సప్లయర్లు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయలేమని చేతులు ఎత్తేస్తున్నారు. ఇది రెస్టారెంట్ ఇండస్ట్రీపై, ఆహార సరఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది' అని రాసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో కలుగజేసుకోవాలని కోరింది. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతమున్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది.

# లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లపై అవిశ్వాసం

### -జగదంబికా పాల్ ప్రత్యేక స్పీకర్‌గా విధులు -చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపి జావెద్
### -విపక్ష నేతను అవమానిస్తూ మాట్లాడేందుకు నిరాకరించారని ఆరోపణ -కాంగ్రెస్ సంప్రదాయాలు పాటించడం లేదన్న కిరణ్ రిజిజు
### -నెహ్రూను తిట్టేవారు ఆయనను జపిస్తున్నారంటూ ప్రియాంక ఎదురుదాడి



**న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ):** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం గురించి లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఈ చర్చ కోసం పది గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. స్పీకర్ ఓం బిర్లా నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, ఆయన అధికార పార్టీ భాష మాట్లాడుతున్నారని తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఆరోపించారు. అనంతరం అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం గురించి చర్చ జరుగుతున్న సమయంలో సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించింది. సీనియర్ ఎంపీ, చైర్ పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో ప్రస్తుతం స్పీకర్ ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టారు. ప్రతిపక్షాల తరపున కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి మాట్లాడేందుకు యత్నించారని, కానీ స్పీకర్ అనుమతినివ్వలేదని అన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమికి లోక్‌సభలో సుమారు 200మంది సభ్యులున్నప్పటికీ.. డిప్యూటీ స్పీకర్ లేరని అన్నారు. డిప్యూటీ స్పీకర్ లేకుండా సభ ఎలా నడుస్తుందో దేశ ప్రజలు చూడాలని అన్నారు. మైక్‌ని కూడా ఆయుధంగా వినియోగి స్తున్నారని అన్నారు. ఎన్‌డిఎ సభ్యులకు మాట్లాడేందుకు అనుమతినిస్తున్నారని, కానీ ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు మైక్‌ని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సభలో హుందాగా మెలగడం లేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుఆరోపించారు. ఈ క్రమంలో గతంలో ప్రధాని మోదీని రాహుల్ ఆలింగనం చేసుకున్న ఘటనను ప్రస్తావించారు. ప్రధాని మోదీ దగ్గరకు వచ్చిన రాహుల్.. ఆలింగనం చేసుకొని వెళ్లి తన సీట్లో కూర్చున్నారు. అనంతరం తోటి ఎంపీలను చూసుకుంటూ కళ్లు ఎగరవేశారు. అటువంటి నేతను ఎప్పుడూ చూడలేదు' అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ చెప్పిన నాటి స్పీకర్ జీవీ మావలాంకర్‌ను సమర్థిస్తూ మాటలను గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. దీనిపై దీటుగా స్పందించిన ప్రియాంకా గాంధీ.. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.రిజిజు విమర్శలను ఎంపీ ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. విపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పే విషయాలను అధికార పక్షం జీర్ణించుకోలేక పోతోందన్నారు. గడిచిన 12 ఏళ్లలో ప్రభుత్వానికి దీటుగా నిలిచిన వ్యక్తి రాహుల్ ఒక్కరేనని అన్నారు. నెహ్రూను ఎప్పుడూ విమర్శించే వాళ్లు అకస్మాత్తుగా ఆయన్ను ప్రశంసించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే తనకు నవ్వు వస్తోందన్నారు. నిరంతరం నెహ్రూను ఆడిపోసుకుంటున్న వారు ఆయన గురించి మాట్లాడంతో నవ్వు ఆపుకోలేక పోయానని అన్నారు. అయితే, ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సభలో లేని సమయంలో ఈ చర్చ జరిగింది. ఆ సమయంలో స్పీకర్ స్థానంలో టిడిపికి చెందిన తెన్నేటి కృష్ణప్రసాద్ ఉన్నారు.

# గురుగ్రామ్‌లో ఘోర ప్రమాదం

### -నిర్మాణంలో ఉన్న గోడ కూలి ఏడుగురు మృతి

**గురుగ్రామ్,మార్చి10(ఆర్ఎన్ఎ):** గురుగ్రామ్‌లో నిర్మాణంలో ఉన్న గోడ కూలడంతో ఏడుగురు మరణించారు. మరో నలుగురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. హర్యానాలోని గురుగ్రామ్ సిద్రావాలి ప్రాంతంలోని సిగేచర్ గ్లోబల్ సొసైటీలో సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి పెద్ద శబ్దంతో గోడకూలిపోయింది. సుమారు 15మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. యంత్రాల సాయంతో శిథిలాలను తొలగించారు. గంటపాటు కొనసాగిన సహాయక చర్యల తర్వాత, కార్మికులను బయటకు తీసి సమీపంలోని ఆస్పత్రికి తరలించామని అధికారులు తెలిపారు. ఏడుగరు కార్మికులు మరణించారని వైద్యులు నిర్ధారించాని అన్నారు. తీవ్రంగా గాయపడిన మరో నలుగురు కార్మికులు చికిత్స పొందుతున్నారని అన్నారు. నిర్మాణ సంస్థ అధికారులెవరూ స్పందించలేదని, ఫిర్యాదులు వినలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ చేరుకున్న కొత్త గవర్నర్

### -శివప్రతాప్ శుక్లాను స్వాగతించిన సిఎం



**హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ):** తెలంగాణకు కొత్తగా నియమితులైన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సిఎం రేవంత్ తదితరులున గవర్నర్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికి వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా లోక్‌భవన్ చేరుకున్నారు.

# ధృవపత్రాల జారీలో నిర్లక్ష్యం తగదు: పీడీఎస్‌యూ

**కడప, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రెవెన్యూ శాఖలో ధృవపత్రాల జారీ విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న తెలిపారు. ప్రస్తుతం ప్రవేశ పరీక్షలు మరియు అడ్మిషన్ ప్రక్రియలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధృవపత్రాలు అత్యవసరంగా అవసరమని పేర్కొన్నారు. మంగళవారం కడపలోని పీడీఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసిన విద్యార్థులు ప్రతిరోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రెవెన్యూ అధికారులు, తహసీల్దార్‌లు, సచివాలయ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా విద్యార్థుల దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకుని పెండింగ్‌లో ఉన్న ధృవపత్రాలను వెంటనే జారీ చేయాలని కోరారు. ప్రవేశ పరీక్షలు, కౌన్సెలింగ్ గడువు సమయం దగ్గరపడుతున్నందున అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన ధృవపత్రాలను త్వరితగతిన అందించాలని సూచించారు.అంబేద్కర్ గురు కులాలు, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో చదువుతున్న విద్యా ర్థులు కూడా ఈ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్ర మంలో పీడీఎస్‌యు జిల్లా, నగర నాయకులు మహేశ్, కిరణ్, వెంకటేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 2 నెలల్లో అంగన్వాడీల సమస్యల పరిష్కరిస్తా!

### - అంగన్వాడీలకు స్వయంగా భోజనాలు వడ్డించిన ఎం.ఎస్.రాజు



**మడకశిర,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మడకశిర నియోజకవర్గంలో అంగన్వాడీలకు ఏ సమస్య వచ్చినా అన్నయ్యగా నేను ఉన్నాననే విషయాన్ని మరచిపోవద్దు అని స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు, శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు హామీ ఇచ్చారు. మడకశిరలోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు ఉదయం అంగన్వాడీలతో సమావేశాన్ని ఎం.ఎస్.రాజు నిర్వహించారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు అంగన్వాడీలను ఉద్దేశించి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలపై కూటమి ప్రభుత్వం చాలా సానుకూలంగా ఉంది. అంగన్వాడీలను గత వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా వేధించింది, వారి సమస్యలపై నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీలు చనిపోతే వారికి దహన సంస్కారాల కోసం రూ.15,000 అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. పదవీ విరమణ చేసిన అనంతరం అంగన్వాడీలకు బెనిఫిట్స్ ఇచ్చేందుకు అవసరమైన మార్గదర్శకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంగన్వాడీల శ్రమకు తగిన ప్రతిఫలాన్ని ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. అంగన్వాడీల ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబుగారు, యువనేత నారా లోకేష్ అంగన్వాడీల సమస్యలను రెండు నెలల్లోపు పరిష్కరించేందుకు శ్రమిస్తున్నారు. అంగన్వాడీలతో కలిసి కూర్చుని భోజనం చేశారు. తమను ఈ విధంగా పిలిచి, ధైర్యం చెప్పి, భోజనం పెట్టి, తమ సమస్యలన్నీ విన్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకు అంగన్వాడీలు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

# ఏప్రిల్ 2 తర్వాత పరిపాలన స్తంబింపజేస్తాం!

### - ప్రజల జీవితాల్లో ఆర్డీటీ అనేది ఒక భాగం
### - వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత హెచ్చరిక

**కుందుర్పి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయని పక్షంలో పరిపాలన స్తంభింపజేస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ఏప్రిల్ 2 వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని, అప్పటిలోగా ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం కుందుర్పిలో లక్ష పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, విశ్వేశ్వర్ రెడ్డి, జెడ్పి చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ పరిశీలకులు మహేంద్రరెడ్డి, నాయకులు ఉమామహేశ్వర నాయుడు, తిప్పేస్వామిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ తొలుత అనంతపురం జిల్లాకు వచ్చినప్పుడు 'గో బ్యాక్ ఆర్డీటీ' అంటూ కొందరు వ్యతిరేకించారని, అప్పట్లో తన తండ్రి అనంత వెంకటరెడ్డి ఆర్డీటీకి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఈ రోజు ఆర్డీటీపై మతం ముద్ర వేసి దేశంలోనే లేకుండా చేయాలన్న కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆర్డీటీ సంస్థ అహర్నిశలు కృషి చేసిందన్నారు. దళిత, గిరిజనులకు విద్యను చేరువ చేసిందని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందించడం కోసం తొలుత చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది ఆర్డీటీ సంస్థేనని తెలియజేశారు. అలాంటి సంస్థను అందరూ కలిసికట్టుగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# కబ్జాదారుల నుండి మా స్థలాన్ని కాపాడండి

**కడప,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కబ్జాదారుల నుండి మా ఇంటి స్థలాన్ని కాపాడాలని మండలం కేంద్రంలోని కాజీపేట టౌన్ బలిజ వీధికి చెందిన ఇసూమ్ బాయ్ కాసిం పీరా, సత్తార్ షావలిలు వేడుకున్నారు సోమవారం వారి ఇంటి స్థలానికి సంబంధించి కడప జిల్లా ఎస్పీ, కలెక్టర్ కు గ్రీవెన్స్‌లో అర్జిద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కాజీపేట గ్రామంలోని సర్వేనెంబర్ 678/దీలో 11 సెంట్లు ఇంటి స్థలం తమ తండ్రి దావు సాహెబ్ పేరిట రిజిస్టర్ కాబడిందని తెలిపారు ఆ స్థలాన్ని అన్నదమ్ములమైన మేము ఇరువురం పంచుకున్నామని చెప్పారు. అయితే మా స్థలాన్ని కొంత మంది దౌర్జన్యంగా ఆక్రమించేందు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు కావున మాకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని కోరారు.

# 13న పిఎం కిసాన్ నిధులు విడుల

### -అసోం వేదికగా ప్రధాని పంపిణీ

**న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ):** దేశంలోని కోట్లాది మంది అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. పీఎం కిసాన్‌కు సంబంధించిన 22వ విడత నిధులు.. రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. దేశ వ్యాప్తంగా రూ.9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2000 వేల చొప్పున జమ కానున్నాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధులు మార్చి 13న విడుదల కానున్నాయి. ఈ పథకం కింద 22వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ కానున్నాయి. ప్రధాని మోదీ.. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. పీఎం-కిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.6 వేలు రైతుల ఖాతాల్లో వేస్తారు. ఈ దఫా కోసం మొత్తం రూ.19 వేల కోట్ల నిధులను కేటాయించారు. అస్సాంలోని గువాహటి వేదికగా నిర్వహించే కార్యక్రమంలో పీఎం-కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. గత ఏడాది నవంబర్ 19వ తేదీన 21వ విడత పీఎం-కిసాన్ నిధులు విడుదల చేశారు. ఈ పథకం ద్వారా దేశంలో పదకొండు కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరనుంది. ఇప్పటి వరకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్లకు పైగా అన్నదాతలకు ఈ నిధులు అందించబడ్డాయి. కాగా, ఏపీ ప్రభుత్వం ఇదే సమయంలో పీఎం-కిసాన్‌తో కలిపి అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.

# కదిరి పుణ్యక్షేత్రంలో వైభవంగా శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం పాల్గొన్న జిల్లా కలెక్టర్

**అనంతపురం,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం (తేరు) మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలో జిల్లా కలెక్టర్ శ్రీ ఎ.శ్యామ్ ప్రసాద్ గారు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య రథాన్ని ప్రారంభించారు.రాష్ట్రం నలుమూలల నుంచే కాక పొరుగు రాష్ట్రాల నుండి కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి రథోత్సవాన్ని తిలకించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి జిల్లా సస్యశ్యామలం కావాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, చలువ పందళ్లు, వైద్య సదుపాయాలు మరియు క్యూ లైన్లను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. తోపులాటలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు, ఉత్సవం ప్రశాంతంగా ముగిసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

**తిరుపతి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ సౌజన్యంతో ఈ నెల 16వ తేదీ నిర్వహించనున్న విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృత్రిమ అవయవాల తయారీ సంస్థ కాన్పూర్ వారు ఈ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు తుడా కార్యాలయం వద్ద గల ఇందిరా మైదానం, గిరిజన భవన్ నందు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల కొరకు సహాయ పరికరాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నారని తెలిపారు. చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ళ చేతి కర్రలు, నాలుగు కాళ్ళ చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు (తోపుడు బండ్లు), చెవి వెనుక ధరించే వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల సైకిళ్ళు, రోలేటర్స్, యం.ఎస్. కిట్స్, అంధుల చేతి వాచ్, అంధుల చేతి కర్రలు, వాయిస్ ఫోన్, ఎల్ బో క్రచస్, లెప్రసీ వ్యాధి నయమైన వ్యాధి గ్రస్తులకు కిట్లు, డైసీ ప్లేయర్స్, యం.యస్.ఐ.డి. కిట్స్, స్మార్ట్ కేన్, కృత్రిమ ఉపకారణాల కొరకు గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నారని తెలిపారు. శిబిరం వివరాలకు మీ దగ్గరలోని స్వర్ణ వార్డు సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. అర్హులైన వారు శిబిరంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

## జాతర మహోత్సవంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ సాయి ప్రసాద్



**శ్రీకాళహస్తి రూరల్,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని బహుదూర్‌పేటలో ఉన్న శ్రీ నల్లగంగమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం తరఫున దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనవాయితీగా ప్రతి సంవత్సరం నల్ల గంగమ్మ తల్లి జాతరలో సారె సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధితో పాటు అనుబంధ ఆలయాలు, పరిసర ప్రాంతాల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్లగంగమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కంటా రమేష్, ఆలయ బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## టిడిపి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు




**శ్రీకాళహస్తి రూరల్, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళా హక్కుల సాధనకు విద్యే సరైన ఆయుధమని, అణచివేతకు గురైన మహిళా శక్తిని ఆధునిక విద్య ద్వారానే విముక్తి చేయాలని సామాజిక ఉద్యమం చేసిన సావిత్రిబాయి పూలే ఒక సామాజిక విప్లవ జ్యోతి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి మరియు వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి పేర్కొన్నారు. సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే, ఆయన సహధర్మచారిణి క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని 18వ వార్డు పరిధిలోని పూసల వీధి కూడలిలో వారి చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడు ఎం. సుబ్బయ్య, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, టీఎన్‌టీయూసీ తిరుపతి పార్లమెంటు నాయకులు వెంకటరమణ, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, సయ్యద్ చాంద్ బాషా, గాజుల భగత్, సోంపల్లి మురళీ నాయుడు, హరి, సయ్యద్ అహ్మద్, సులేమాన్, మహమ్మద్ రఫీ, ఆనంద్, నూర్ మొహమ్మద్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జీవన పరికరాల పంపిణీకి నిర్ధారణ శిబిరం



**సత్యవేడు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెల 12న పిచ్చాటూరులో దివ్యాంగులు, వయోవృద్ధులకు జీవన పరికరాల పంపిణీ కొరకు నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ మహమ్మద్ రఫీ తెలిపారు.గురువారం పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్‌లో తలపెట్టిన ఈ నిర్ధారణ శిబిరంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొననున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. శిబిరం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం మండలాలకు చెందిన దివ్యాంగులు, వయోవృద్ధులకు పిచ్చాటూరు శిబిరం కేటాయించినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ అవకాశాన్ని వయోవృద్ధులు దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




## దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు నిర్దేశిత సమయంలోనే అనుమతి



**తిరుమల, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్లాటెడ్ సర్వ దర్శనం టోకెన్లు, రూ.300 ప్రత్యేక దర్శనం టికెట్లు కలిగిన భక్తులను వారికి కేటాయించిన స్లాట్ ప్రకారం నిర్దేశిత సమయంలోనే అనుమతించడం జరుగుతుందని టీటీడీ స్పష్టం చేస్తోంది. ఈ నిబంధనను సోమవారం నుండి టీటీడీ కఠినంగా అమలు చేస్తోంది. భక్తులు తమకు కేటాయించిన సమయానికంటే ముందుగా వచ్చి ఇబ్బంది పడవద్దు. అలాగే సమయం పాటించే భక్తులను ఇబ్బంది పెట్టవద్దు. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు టీటీడీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని తమకు కేటాయించిన సమయానికే క్యూలైన్ల వద్దకు చేరుకోవాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.



## శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు మోటార్ వాహన తనిఖీలు

**తిరుమల, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల ఘాట్ రోడ్డుకు ప్రవేశ ద్వారం అలిపిరి టోల్ గేట్ వద్ద శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు తిరుపతి మోటార్ వాహన తనిఖీ అధికారులు తిరుమల ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అధిక శబ్దం చేసే మార్పు చేసిన సైలెన్సర్లు ఉపయోగిస్తున్న ద్విచక్ర వాహనాలు ఇతర వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి తనిఖీలు నిర్వహించారు. అధికంగా శబ్ద కాలుష్యాన్ని వెలువరిస్తున్న జీపులు ఇతర రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ మోటార్ వాహన చట్టంలోని మోటార్ వెహికల్ యాక్ట్ 1988 ప్రకారం వాహనాల్లో అనుమతించిన డేసిబెల్స్ పరిమితిని మించిపోయే విధంగా శబ్దం చేసే సైలెన్సర్లు ఉపయోగించడం నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు ముఖ్యంగా చట్టంలోని సెక్షన్ 190(2) ప్రకారం ఈ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ హరి ప్రసాద్ తెలిపారు. తిరుమల వంటి ఆధ్యాత్మిక ప్రాంతంలో అధిక శబ్దం భక్తులకు మరియు స్థానిక ప్రజలకు అసౌకర్యం కలిగించడంతో పాటు పర్యావరణానికి కూడా హానికరం అవుతుందని ఈ నేపథ్యంలో శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. తనిఖీల సమయంలో అనుమతించిన ప్రమాణాలకు విరుద్ధంగా మార్పులు చేసిన సైలెన్సర్లు ఉన్న వాహనాలను గుర్తించి, వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన చోట్ల జరిమానాలు విధించారు. అలాగే వాహనదారులు తమ వాహనాలను మోటార్ వాహన చట్టం ప్రకారం నిర్వహించుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల సౌకర్యం దృష్ట్యా వాహనదారులు అనుమతించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలని, అనధికార సైరన్ లను ఉపయోగించరాదని అధికారులు విజ్ఞప్తి చేశారు. శబ్ద కాలుష్యాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజలు స్వచ్ఛందంగా వాహన నియమాలను పాటించి సహకరించాలని కోరారు. ఇలాంటి తనిఖీలు భవిష్యత్తులో కూడా తిరుపతి మరియు తిరుమల ప్రాంతాల్లో కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో రవాణా వాహనాలపై 25 వాహన తనిఖీ రసీదులు నమోదు చేయడం జరిగింది. అపరాధ రుసుముగా 1,50,000 వసూలు చేయడం జరిగింది.ఈ తనిఖీలలో తిరుమల ట్రాఫిక్ సీఏ హరిప్రసాద్ మోటార్ వాహన తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం శ్రీనివాసరావు మోహన్ కుమార్ రమణ నాయక్ అతికానాజ్ స్వర్ణలత ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

## స్విమ్స్‌కు ఫెడరల్ బ్యాంక్ యాజమాన్యం అంబులెన్స్ వితరణ



**తిరుపతి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్విమ్స్ హాస్పిటల్‌కి మంగళవారం ఉదయం తిరుపతి బ్రాంచ్ ఫెడరల్ బ్యాంక్ యాజమాన్యం సూమారు రూ.28 లక్షల విలువ చేసే అంబులెన్స్‌ను విరాళంగా అందజేయడం జరిగిందని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ గారు తెలియజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న స్విమ్స్ హాస్పిటల్‌వారు నిరుపేదలకు అందిస్తున్న వైద్య సేవలకు గానూ ఈ అంబులెన్సును విరాళంగా సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా అందజేసినట్లు తిరుపతి ఫెడరల్ బ్యాంకు రీజినల్ హెడ్‌ఐ స్వాతి ప్రియ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా॥ ఆర్.వి.కుమార్ తిరుపతి ఫెడరల్ బ్యాంకు వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేసి, బ్యాంకు వారిని శాలువతో సన్మానించడం జరిగింది. అనంతరం స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా॥ఆర్.వి.కుమార్‌కి వాహన పత్రాలను ఫెడరల్ బ్యాంకు వారు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో తిరుపతి ఫెడరల్ బ్యాంక్ హెడ్ జి.రవి, ఆర్.బి.ఎస్.ఎల్. హెడ్ వై.సాయికుమార్, బ్యాంక్ సిబ్బంది, స్విమ్స్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ దేవరకొండ గోపి ,ఆర్.ఎం.ఓ. డా॥ సతీష్, ఎ.డి. జనరల్ మేనేజర్ అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్ర బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ (పి.ఆర్) వి.రాజశేఖర్, ఫైర్ సెఫ్టీ ఆఫీసర్ ఇలంగో రెడ్డి, డ్రైవర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం 12న గుర్తింపు శిబిరం

**సత్యవేడు, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మార్చి 12న దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం సహాయక పరికరాల గుర్తింపు శిబిరం జరుగుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు కృత్రిమ అవయవాల తయారు సంస్థ(అలిమ్కో) ఆధ్వర్యంలో సహాయక పరికరాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఈ నేపథ్యంలో శిబిరంలో దివ్యాంగులకు,వయోవృద్ధులకు వారి శారీరక అవసరాన్ని అనుసరించి గుర్తించిన వారికి కొంతకాల వ్యవధిలోనే సహాయక పరికరాలను పంపిణీ చేస్తారన్నారు. సత్యవేడు, బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం మండలాలకు సంబంధించిన దివ్యాంగులు, వయోవృద్ధులు శిబిరానికి హాజరై వారి భౌతిక అవసరాలను బట్టి జీవన సహాయ పరికరాల కోసం నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

## సావిత్రిబాయి పూలేకి మేయర్ నివాళి



**తిరుపతి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహానికి బీసీ సంఘర్షణ కమిటీ ప్రతినిధులతో కలిసి తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్ఈసీ మెంబర్ డాక్టర్ శిరీష నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేవర్ధంతి నేడు. 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నైగావ్‌లో జన్మించిన ఆమె, 1897 మార్చి 10న మన నుంచి దురమైనారు. భర్త జ్యోతిరావు పూలేతో కలిసి మహిళా విద్య, నిమ్న వర్గాల అభ్యున్నతి, బాలికల పాఠశాలల స్థాపన కోసం కృషి చేశారు. విద్య ద్వారానే మహిళా సాధికారిత సాధ్యం అవుతుందని పూలే ఆదర్శ దంపతులు నమ్మడమే కాకుండా అందుకు జీవితాంతం కృషి చేశారు. అందుకే 'భారత మహిళా విద్యా ఉద్యమ మాతృమూర్తి'గా సావిత్రిబాయి గారిని అభివర్ణిస్తారు. భర్త జ్యోతిరావు పూలేతో కలిసి 1848లో పూణేలోని భిడే వాడాలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారు. సామాజిక కట్టుబాట్లను, కుల వివక్షను ఎదిరించి మహిళా విద్య, సమానత్వం, మరియు విధవా పునర్వివాహాల కోసం పోరాడారు. పూలే గారు గొప్ప కవయిత్రి కూడా. ఆమె 'కావ్య పూలే', 'బావన్ కషి సుబోధ్ రత్నాకర్' వంటి రచనలు చేశారు. బాల్య వివాహాలను నిరసిస్తూ, వితంతువుల కోసం 'బాలహత్యా ప్రతిబంధక గృహ'ను స్థాపించారు. కార్యక్రమంలో బి.సి. సంఘర్షణ సమితి సభ్యులు అక్కిరిపల్లి లక్ష్మయ్య, సకం ప్రభాకర్, అశోక్ సామ్రాట్ యాదవ్, మస్తానమ్మ, వెంకటరమణ, చంద్రబాబు యాదవ్, డిష్ రమణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయండి

### - స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్



**తిరుపతి,మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ 42 బోర్డు సమావేశం స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. స్మార్ట్ సిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్, తుడా వి. సి.గోవింద రావు, ఇండిపెండెంట్ డైరెక్టర్లు డాక్టర్ రమాశ్రీ లు ఆన్లైన్ ద్వారా పాల్గొనగా నగరపాలక సంస్థ కార్యాలయం నుండి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొని పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. తూకివాకం వద్ద స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న 6మెగా వాట్ గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇంటిగ్రెటెడ్ కమాండర్ కంట్రోల్ సెంటర్ లో బాగంగా నగరంలో సిసి కెమెరాల ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు లను త్వరగా పూర్తి చేసేలా నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో బోర్డు డైరెక్టర్ డాక్టర్ రామచంద్రా రెడ్డి, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, ఈ.ఈ.రవి, తదితరులు పాల్గొన్నారు.

## కొండూరులో కార్డన్, సెర్చ్



**సూళ్లూరుపేట, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తడ మండలంలోని కొండూరు గ్రామంలో కార్డన్, సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్, సెర్చ్ లో తడ ఎస్సై కొండప్ప నాయుడు, సూళ్లూరుపేట ఎస్సై అజయ్ కుమార్, సుబ్రహ్మణ్యం రాజు, శ్రీహరి కోట ఎస్సై నాగబాబుతో పాటు సర్కిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండూరు పరిసర ప్రాంతాల్లోని కంపెనీలలో పని చేస్తూ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ నివసిస్తున్న కార్మికులతో పోలీసులు సమావేశమై మాట్లాడారు. స్థానికంగా ఉండే సమయంలో శాంతి భద్రతలను పాటించాలని, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే కార్మికులు తమ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని తెలియజేశారు. కార్మికులు మత్తు పదార్థాలపై అవగాహన కలిగి ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలియజేశారు. ఈ సందర్భంగా డ్రోన్ కెమెరా ఉపయోగించి అనుమానిత ప్రాంతాలను తనిఖీ చేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027